ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
శనివారం 14 సెప్టెంబరు 2024


నష్టపరిహారం చెల్లించకుండానే ఏర్పాటు చేసిన విద్యుత్ కేంద్రం

వాళ్లంతా పుడమి తల్లిని నమ్ముకొని బతికేటోళ్లు. సేద్యం తప్ప మరో జీవనాధారం లేదు. కాడి కట్టి.. మేడి పట్టి.. కండలు కరిగించి.. చెమట చిందించి.. భూములు సాగుచేయడమే వారికి తెలుసు. అలాంటిది ఏటా రెండు కార్లు పండే భూములను సైతం సోలార్ అధికారుల మాటలను నమ్మి వదులుకున్న త్యాగమూర్తులు. కానీ భూములకు బదులు.. మరోచోట భూములు ఇస్తామని నమ్మబలికిన అధికారులు వారి త్యాగాన్ని అపహాస్యం చేశారు. కొందరికి భూములిచ్చినా.. వాటికి సంబంధించిన భూయాజమాన్య హక్కులను ఇవ్వకుండా అలసత్వం ప్రదర్శించారు. తద్వారా సాగుకు అనువైన భూములను వదులుకొని.. పైసా ఆదాయం లేక, కుటుంబ పోషణ బరువై పిల్లలను కూడా చదివించుకోలేని స్థితిలో ఆ రైతు కుటుంబాలు ఉన్నాయి. ఒకపక్క ప్రాజెక్టు వల్ల కొంత భూమి కోల్పోతే.. ఉన్న కాస్త భూమి సోలార్ వల్ల కోల్పోయి వీధినపడ్డారు. నూతన ప్రభుత్వంలోనైనా తమకు న్యాయం జరుగుతుందని కొండంత ఆశతో ఎదురుచూస్తున్నారు.

భూములు పాయే..

బతుకులు పాయే..!

- సోలార్ అధికారుల నిర్వాకం.. రైతులకు శాపం
- అధికారుల హామీ ఏటిపాలు
- భూహక్కుల కోసం కాళ్లరిగేలా తిరుగుతున్నా కనికరించని అధికారులు
- కూటమి ప్రభుత్వంలోనైనా న్యాయం చేయాలని రైతుల వేడుకోలు


వెలిగల్లులో రైతుల భూముల్లో ఏర్పాటు చేసిన సోలార్ ప్లాంట్

గాలివీడు, సెప్టెంబరు 13: మండలంలోని వెలిగల్లు, తూముకుంట పంచాయతీల్లో సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేశారు. ఈ సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పడక ముందు వెలిగల్లు పంచాయతీకి చెందిన రైతులు ఎటువంటి చింత చినుకు లేకుండా ప్రతి ఏటా రెండు సీజన్లలో రెండు పంటలను పండించుకొనేవాళ్లు. అయితే 2016 సంవత్సరంలో వెలిగల్లు పంచాయతీలో సోలార్ ప్లాంటును ఏర్పాటు చేయాలని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి. ఇక్కడ కొంతమేర ప్రభుత్వ భూములు ఉండడమే ఈ ప్లాంటు నిర్మాణానికి మూల కారణం. అయితే రైతులకు కూడా భూములు తక్కువగా ఉండేది. ఎందుకంటే వెలిగల్లు పంచాయతీకి అతి సమీపంలో వెలిగల్లు ప్రాజెక్టు కలదు. ఈ ప్రాజెక్టు నిర్మాణం వల్ల వెలిగల్లు పంచాయతీలో నివసిస్తున్న ప్రజల ఇళ్లు పూర్తిగా ప్రాజెక్టు మునక పరిధిలోకి వెళ్లిపోయాయి. గృహాలతో పాటు 80 శాతం భూములు కూడా ప్రాజెక్టు మునకలోకి వెళ్లడంతో అప్పటి ప్రభుత్వం ఆ గ్రామ ప్రజలకు అదే పంచాయతీలోని విశాలమైన ప్రభుత్వ భూమిలో గృహాలను నిర్మించి ఇచ్చారు. కొంతమందికి భూములను కూడా పంపిణీ చేసింది. ప్రాజెక్టు నిర్మాణం వల్ల పరిసర ప్రాంతాల్లోని భూముల్లో రైతులు ఏడాదికి రెండు పంటలను సాగు చేస్తూ జీవిస్తూ ఉండేవారు. కానీ ఉన్నట్లుండి 2016వ సంవత్సరంలో కేంద్ర ప్రభుత్వం వెలిగల్లు పంచాయతీలో సోలార్ ప్లాంటు నిర్మాణానికి అనుమతులు ఇచ్చింది. ఈ నిర్ణయం ఇక్కడి రైతుల్లో తీవ్ర ఆందోళనలు కలిగించింది. ప్రాజెక్టు వల్ల కొంత భూమిని కోల్పోయి.. సోలార్ ప్లాంట్ వల్ల ఉన్న భూములుపోతే తామెలా బతకాలని రైతులు ఆవేదన చెందారు. కాగా ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల తాము భూములు కోల్పోయి నష్టపోయినా పర్వాలేదు, ప్రజలకు మేలు జరుగుతుందని రైతులు వారి భూములను త్యాగం చేశారు. అందరూ మూకుమ్మడిగా ఏకతాటిపైకి వచ్చి సోలార్‌కు భూములను అప్పగించారు. కొంతమంది రైతులు ప్రభుత్వం అందించిన నష్టపరిహారాన్ని తీసుకొని వారి భూములను సోలార్ ప్లాంట్‌కు అప్పగించగా.. మరికొంత మంది రైతులు సోలార్‌కు ఇచ్చిన భూములకు బదులుగా మరోచోట భూములు కావాలని అప్పటి ప్రభుత్వాధికారులకు వారి డిమాండ్లను అందజేశారు. భూమికి భూమి ఇస్తేనే తమ భూముల్లో సోలార్‌ప్లాంట్ నిర్మాణాలకు అడ్డు చెప్పమని, లేదంటే తమ భూముల్లో సోలార్ ప్లాంటును ఏర్పాటు చేయవద్దని రైతులు అధికారులకు తెలియజేశారు.



భూ యాజమాన్య హక్కులు కల్పించాలి..

నాకు వెలిగల్లు ప్రాజెక్టు వల్ల కొంత భూమి కోల్పోయాను. ఉన్న భూమి సోలార్ వల్ల కోల్పోయాను. సోలార్ వల్ల కోల్పోయిన భూమిలో మామిడి చెట్లు ఉండేవి. మరికొంత భూమిలో ఏడాదికి రెండు పంటలను సాగు చేసుకునేవాళ్లం. ఆ రోజు (2016) సోలార్ అధికారులు భూమికి భూమి మరోచోట ఇచ్చి.. వాటికి భూయాజమాన్య హక్కులు కల్పిస్తామంటేనే నేను సమ్మతించాను. కానీ ఇంతవరకు నాకు ఆ భూమిపైన భూయాజమాన్య హక్కులు ఇవ్వలేదు. దీంతో నేను 6 ఏళ్లుగా ఎలాంటి పంటలను సాగుచేయలేదు. వారి విధానాల వల్ల నేను తీవ్రంగా నష్టపోయాను. ఇప్పటికైనా అధికారులు స్పందించి భూ యాజమాన్య హక్కులు కల్పించాలి.

- టీఎస్ మహబూబ్‌బాషా, వెలిగల్లు

రైతులకు, అధికారులకు మధ్య ఒప్పందం

వెలిగల్లు పంచాయతీలో ఏర్పాటు చేసిన సోలార్ ప్లాంటు అధికారులకు, రైతులకు మధ్య ఒక ఒప్పందం కుదిరింది. మొదట ఆర్ఎస్ఆర్ పట్టా భూమికి ఎకరానికి రూ.3 లక్షలు, డీకేటీ భూమికి ఎకరాకు రూ.2.64 లక్షలు, అనుభవంలో ఉన్న భూములకు రూ.లక్ష నష్టపరిహారం ఇచ్చేలా ఒప్పందం కుదిరింది. మరో ఒప్పందం ప్రకారం సోలార్ వల్ల భూములు కోల్పోయిన రైతులు అంతకన్నా ఎక్కువ భూమిని మరోచోట రైతులకు ఇచ్చేలా హామీ ఇచ్చారు. నష్టపరిహారాన్ని ఒప్పుకొన్న రైతులకు మాత్రం భూములకు నష్టపరిహారాన్ని చెల్లించారు. కానీ భూములకు భూములు ఇస్తామని ఒప్పందం చేసుకున్న రైతులకు మాత్రం మొండిచేయి చూపించారు. ఇందులో కొంతమంది రైతులకు భూములను చూపించినప్పటికీ వారికి ఆ భూములపైన ఎలాంటి హక్కులు కల్పించ లేదు. తమ భూములకు హక్కులను కల్పించాలని గత 7 ఏళ్లుగా అటు సోలార్ అధికారులు, ఇటు ప్రభుత్వ అధికారుల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నప్పటికీ వారిలో ఏమాత్రం చలనం లేదని రైతులు వాపోతున్నారు. అలాంటి వారిలో టీఎస్ మహబూబ్‌బాషా 5ఎకరాలు, టీఎస్ షరావుద్దీన్ 5ఎకరాలు, బండి క్రిష్ణమూర్తి 4 ఎకరాలు, సరోజమ్మ 2 ఎకరాలు, పీరాన్‌సాబ్ 5 ఎకరాలు, అల్లాబక్ష 2 ఎకరాలు, గౌస్‌పీర్ 2.50 ఎకరాలు సోలార్ ప్లాంటు వల్ల భూములను కోల్పోయారు. వారిలో టీఎస్ మహబూబ్‌బాషాకు భూమిలో మామిడి చెట్లు కూడా ఉండేవని, ఏడాదికి రెండు పంటలను సాగు చేసేవాళ్లమని, ఇలాంటి భూములను ఒక్క రూపాయి కూడా నష్టపరిహారం తీసుకోకుండా సోలార్ ప్లాంటుకు ఇచ్చామని వారు తెలిపారు. భూమికి భూమి మరోచోట ఇచ్చి వాటిపైన సంపూర్ణ భూ హక్కులు కల్పిస్తామని సోలార్ పవర్ ప్రాజెక్టు అధికారులు హామీ ఇచ్చి తమ భూములను స్వాధీనం చేసుకున్నార ని పేర్కొన్నారు. గత 6 ఏళ్లుగా తమకు భూయాజమాన్య హక్కులు కల్పించాలని సోలార్ అధికారులు, ప్రభుత్వ అధికారుల చుట్టూ చెప్పులరిగేలా తిరిగినా వాళ్లలో ఎలాంటి స్పందన కనపడలేదని ఆరోపించారు. భూయాజమాన్య హక్కులు కల్పించకపోవడం వల్ల ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలను పొందలేక పోవడంతో పాటు ఆ భూముల్లో బోర్లు, విద్యుత్ తోటల సాగు వంటివి చేసుకోలేక పోతున్నామని ఆరోపించారు. ఇప్పటికైనా సోలార్, ప్రభుత్వాధికారులు స్పందించి సోలార్ వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారంతో పాటు భూమికి భూమి ఇచ్చి వాటి యాజమాన్య హక్కులు కల్పించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

భయపెట్టి భూమిని



వెలిగల్లు ప్రాజెక్టు వద్ద వరి పండే భూమిని కోల్పోయాను. సోలార్ ప్లాంటు నిర్మాణం వల్ల ఉండే భూమిపోతే కుటుంబాన్ని పోషించలేనని భావించి నా భూమిని సోలార్ ప్లాంటుకు ఇవ్వనని నేను, మా అమ్మ, మా భార్య మొండికేసి కూర్చున్నాము. కానీ అధికారులు బలవంతంగా భూములను లాక్కున్నారు. నాకు ఉన్న 4 ఎకరాల 10 సెంట్ల భూమిలో సోలార్ ఏర్పాటు చేశారు. ఇందుకుగానూ మరో చోట భూమికి భూమి ఇస్తామని హామీ ఇచ్చినారు. భూమిని అయితే చూపించారు కానీ ఆ భూమికి ఇంతవరకు ఎలాంటి ఆధారాలు, హక్కులు కల్పించలేదు. మేము క్రాప్‌లోన్లు పెట్టుకోవాలన్నా, తోటలను పొందాలన్నా, ప్రభుత్వ రాయితీలు పొందాలన్నా భూమికి సంబంధించి ఎలాంటి హక్కులు లేవు.

- క్రిష్ణమూర్తి, వెలిగల్లు

త్వరలోనే సమస్యను పరిష్కరిస్తాం..

సోలార్ పవర్ ప్లాంట్‌కు భూములిచ్చిన 7 మంది రైతులకు ఎలాంటి నష్టపరిహారం ఇవ్వలేదు. వారి భూమికి బదులు మరోచోట భూమిని ఇచ్చాము, కానీ ఆ భూమికి సంబంధించిన భూయాజమాన్య హక్కులను ఇంతవరకు ఇవ్వలేదు. రైతులకు అగ్రిమెంటు రాసి ఇచ్చాము. రైతులకు హక్కులు కల్పించాలని రెవెన్యూ అధికారులకు తెలియజేశాము. ఏదేమైనా త్వరలోనే కలెక్టర్‌తో మాట్లాడి రైతులకు హక్కులను కల్పించేందుకు కృషి చేస్తాను.

- శివశంకర్‌నాయుడు, డీఈ, సోలార్ పవర్ ప్రాజెక్టు


ఆసుపత్రి సీజ్ చేసినట్లు డా.బి.బాషాకు నోటీసు అందజేస్తున్న అధికారులు

లింగ నిర్ధారణ చేస్తున్న స్కానింగ్ సెంటర్ సీజ్

- రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్న పీసీపీఎన్‌డీటీ అధికారులు
- పీలేరులో ఘటన

పీలేరు, సెప్టెంబరు 13: కాసిన్ని కాసులకు కక్కుర్తి పడి పీలేరు పట్టణంలో గర్భస్థ లింగ నిర్ధారణ చేస్తున్న ఓ స్కానింగ్ సెంటర్‌ను పీసీపీఎన్‌డీటీ (గర్భస్థ శిశు లింగనిర్ధారణ నిషేధ చట్టం) అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. గతంలో ఇదే అభియోగాలపై సీజ్ అయినప్పటికీ ఏమాత్రం జంకకుండా అదే ప్రాంగణంలో ఎటువంటి అనుమతులు లేకుండా మరో కొత్త మెషీన్‌తో స్కానింగ్ నిర్వహిస్తున్నట్లు తెలుసుకుని నివ్వెరపోయారు. పవిత్రమైన వైద్య వృత్తిలో ఉంటూ నిబంధనలు ఉల్లంఘించడమే కాకుండా పదే పదే లింగ నిర్ధారణకు పాల్పడుతున్నట్లు తెలుసుకుని తెల్లమొహాలు వేశారు. కేవలం రెండేళ్ల వ్యవధిలో మూడుసార్లు స్కానింగ్ సెంటర్‌ను సీజ్ చేసినా తీరు మార్చుకోని ఆ వైద్యుడిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందుగా అందిన సమాచారం మేరకు జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి, జిల్లా పీసీపీఎన్‌డీటీ యాక్ట్ నోడల్ అధికారి డా.ఉషశ్రీ, పీసీపీఎన్‌డీటీ ప్రోగ్రాం ఆఫీసర్ దేవశిరోమణి శుక్రవారం పీలేరులోని ఎల్‌బీఎస్ రోడ్డు, రైల్వేగేటు పక్కనున్న నోబుల్ నర్సింగ్ హోంలో నడుస్తున్న స్కానింగ్ కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆ సమయంలో నర్సింగ్ హోం అధినేత డా.జి.బాషా స్వయంగా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తూ వారికి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. దీంతో ఆసుపత్రి, స్కానింగ్ కేంద్రాన్ని సీజ్ చేయాల్సి రావడంతో నిబంధనల మేరకు స్థానిక రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. గతంలోనూ ఆ స్కానింగ్ కేంద్రాన్ని సీజ్ చేసినట్లు రెవెన్యూ అధికారులు డా.ఉషశ్రీ, దేవశిరోమణికి తెలపడంతో వారు దాని గురించి డా.జి.బాషాను వాకబు చేయగా అవునని ఆయన సమాధానం చెప్పారు. సీజ్ చేసిన స్కానింగ్ కేంద్రంలోని మెషీన్లను వాడడం లేదని, కొత్త మెషీన్లతో స్కానింగ్ చేస్తున్నట్లు చెప్పడంతో వారు ఖంగుతిన్నారు. పీలేరు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఉన్నప్పుడు అప్పటి వైద్య శాఖాధికారులు, పీసీపీఎన్‌డీటీ అధికారులు దాడులు చేసి లింగ నిర్ధారణ చేస్తున్నట్లు కనుగొని స్కానింగ్ కేంద్రాన్ని సీజ్ చేశారని, సీజ్ చేసిన కేంద్రం స్థానంలో తాను కొత్త కేంద్రం నడుపుతున్నట్లు డా.బాషా వారికి సమాధానం ఇచ్చారు. దీంతో వారు చేసేదిలేక ఈ విషయాన్ని రాయచోటి ఆర్డీవో రంగస్వామితో సహా జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. వారి ఆదేశాల మేరకు స్కానింగ్ కేంద్రాన్ని సీజ్ చేశారు. అనంతరం వారు విలేఖరులతో మాట్లాడుతూ డా.జి.బాషా పదేపదే లింగ నిర్ధారణ పరీక్ష లు చేస్తుండడంతో ఆయనపై ఎటువంటి చర్యలు తీసుకోవాలో ఉన్నతాధికా రులు నిర్ణయిస్తారని, వారి ఆదేశాల మేరకు తాము నడుచుకుంటామని తెలిపారు. పీలేరు తహసీల్దారు భీమేశ్వరరావు, ఎస్‌ఐ బాలకృష్ణ సమక్షంలో స్కానింగ్ కేంద్రాన్ని సీజ్ చేశారు. ఈ విషయం పీలేరులోని వైద్య వర్గాల్లో చర్చనీయాంశమైంది.

నేడు స్వదేశానికి రానున్న బాధిత మహిళ

- రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి చొరవ



సంబేపల్లె, సెప్టెంబరు 13: కువైత్‌లో చిత్రహింసలకు గురవుతున్నానంటూ సెల్ఫీ వీడియో పెట్టి కన్నీటి పర్యంతమైన మహిళ శనివారం స్వదేశానికి రానుంది. రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి చొరవ తీసుకుని గల్ఫ్ అధికారులతో మాట్లాడి ఆమెను స్వగ్రామానికి రప్పిస్తున్నారు. వివరాల్లోకెళ్తే... సంబేపల్లె మండలం నారాయణరెడ్డిగారిపల్లికు చెందిన తిరుపతి కవిత బతుకుతెరువు కోసం 8 నెలల క్రితం కువైత్‌కు వెళ్లింది. ఆమెకు ముగ్గురు కూమార్తెలు, భర్త వెంకటేశ్వర్లు ఉన్నారు. కాగా తనను చిత్రహింసలకు గురిచేస్తున్నారని, కాపాడాలని మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని కోరుతూ ఆమె గురువారం సెల్ఫీ వీడియో విడుదల చేసింది. దీంతో మంత్రి స్పందించి ఎలాగైనా ఆ మహిళను ఇండియాకు రప్పించాలని సంబంధిత మంత్రి, అధికారులకు లెటర్ రాశారు. కాగా అక్కడి అధికారులు ఆమెను ఇండియాకు పంపేందుకు అంగీకరించారని, ఆమె శనివారం ఉదయం ఇక్కడికి వస్తున్నట్లు ఆమె కుమార్తెలు తెలిపారు. ఇదిలా ఉండగా కూటమి ప్రభుత్వం గల్ఫ్ బాధితులకు అండగా నిలుస్తోంది. జిల్లాలో ఇటీవల జరిగిన సంఘటనలే ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. మొన్న వాయల్పాడు మండలం చింతపర్తికి చెందిన శివ ఎడారిలో తన బాధలను వ్యక్తం చేస్తూ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు సెల్ఫీ వీడియో పంపారు. అదేవిధంగా మదనపల్లికి చెందిన ఓ ముస్లిం మహిళ గల్ఫ్‌లో చిత్రహింసలు పడుతున్నానంటూ వీడియో విడుదల చేయడంతో వారిని ఇండియాకు రప్పించారు. కాగా ప్రస్తుతం సంబేపల్లె మండలం నారాయణరెడ్డిపల్లికి చెందిన తిరుపతి కవిత మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి పంపిన సెల్ఫీ వీడియోకు మంత్రి స్పందించారు. కాగా మహిళ స్వగ్రామానికి రానుండడంతో కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



కూటమి సర్కార్‌పై 'కొండ'ంత ఆశ


హార్సిలీహిల్స్‌లో ఉన్న హరిత రెస్టారెంట్


ఒబెరాయ్ బృందంలో కలెక్టర్ శ్రీధర్ చామకూరి (ఫైల్)


సాహస క్రీడల కోసం కేటాయించిన భూమిని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ (ఫైల్)

- హార్సిలీహిల్స్ అభివృద్ధిపై కనికరిస్తే మహర్దశే
- మరుగున పడిన ప్రాజెక్టులు చేపడితే పర్యాటకానికి ఊపు
- ఒబెరాయ్ హోటల్ పనులతో మలుపు
- వైసీపీ హయాంలో అభివృద్ధి శూన్యం

బి.కొత్తకోట, సెప్టెంబరు 13: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రాకతో హార్సిలీహిల్స్‌కు ఇకపై మంచిరోజులు వస్తాయని అందరిలో ఆశలు చిగురిస్తున్నాయి. వైసీపీ హయాంలో మసకబారిన హిల్స్ ప్రతిష్ఠను అభివృద్ధితో ఇనుమడింపజేసి పర్యాటకులకు కానుకగా ఇస్తారని భావిస్తున్నారు. సముద్ర మట్టానికి 4312 అడుగుల ఎత్తులో ఉండి, ఆంధ్రా ఊటీగా పేరుగాంచిన హార్సిలీహిల్స్ అభివృద్ధికి గత వైసీపీ ప్రభుత్వం పైసా విదల్చక పోగా రూ.కోట్ల విలువైన క్రీడా శిక్షణా స్థలాన్ని అస్మదీయుడికి కట్టబెట్టాలని విఫలయత్నం చేసింది. గత ప్రభుత్వం పర్యాటక రంగానికి పాతరేసింది. కూటమి ప్రభుత్వం రాకతో హిల్స్ పెండింగ్ ప్రాజెక్టులపై దృష్టి సారింపు, రీసర్వేలు, నిధుల కేటాయింపుపై అందరూ ఆశతో ఉన్నారు. ఒబెరాయ్ హోటల్ నిర్మాణానికి సంబంధించిన పనుల కదలికతో ఊపొచ్చింది. హార్సిలీహిల్స్ అభివృద్ధికి గతంలో రూపొందించిన మాస్టర్ ప్లాన్ ప్రకారం జాతీయ స్థాయి పర్యాటక కేంద్రంగా గుర్తింపు పొందే రోజు దగ్గరలోనే ఉన్నట్లు పలువురు అభిప్రాయపడుతున్నారు.

ఒబెరాయ్ హోటల్ నిర్మాణంలో కదలిక

ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న రూ.200 కోట్ల ప్రాజెక్టు ఒబెరాయ్ హోటల్ పనులపై కూటమి సర్కార్ అధికారంలోకి రాగానే సీఎం చంద్రబాబు దృష్టి సారించారు. సీఎం ఆదేశాలతో కలెక్టర్ చామకూరి శ్రీధర్ చర్యలు చేపట్టారు. ఒబెరాయ్ సంస్థ ప్రతినిధులను రప్పించి, కొండ విశిష్టతను, హోటల్ నెలకొల్పడానికి అనువైన పరిస్థితులను వివరించారు. వారికి కేటాయించిన 20.80 ఎకరాల స్థలాన్ని చూపించారు. ఒబెరాయ్ బృందం సంతృప్తి చెంది బోర్డు మీటింగులో చర్చించి త్వరలో నిర్మాణ పనులు చేపడతామని చెప్పడంతో ఇక హిల్స్‌లో అభివృద్ధి పరుగులు పెడుతుందని అందరూ భావిస్తున్నారు.

పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి ప్రాజెక్టులు..

2014లో రోప్‌వే ఏర్పాటుకు సర్వే చేశారు. సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు ఢిల్లీకి చెందిన బృందం సైతం పర్యటించింది. హిల్స్‌పై నుంచి దిగువనున్న అమరనారాయణపురం వరకు విశాఖ తరహాలో రోప్‌వేను నిర్మించి పర్యాటకులను ఆకట్టుకోవాలని భావించారు. అయితే ఈ మార్గంలో విద్యుత్ లైను ఉందని, ప్రత్యామ్నాయ మార్గం చూడాలని పెండింగ్‌లో పెట్టారు. అది ఇప్పటికీ పెండింగ్‌లోనే ఉంది. ఏపీ టూరిజం హరిత రిసార్టుల నిర్మాణానికి రూ.6.50 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. అయినా నిధులు విడుదల కాక ఉన్నంతలో పని కానిచ్చేస్తున్నారు. పర్యాటకశాఖ నిధులిస్తే సుందరమైన రిసార్టు వెలుస్తుంది. అటవీశాఖ ప్రాంగణంలోని జూపార్కులో జంతువులు, పక్షులు తగినన్ని లేవు. నాలుగెకరాల బండపై సాహసక్రీడల సముదాయం ఏర్పాటు ప్రతిపాదనలకే పరిమితమైంది. ఘాట్ రోడ్డులోని మలుపులలో రహదారిని విస్తరించడంతో పాటు రక్షణగోడను నిర్మించాలన్న ప్రతిపాదన అలాగే ఉంది. క్రీడా శిక్షణా కేంద్రం కోసం ఇచ్చిన 3.74 ఎకరాల స్థలంలో పనులకు రూ.3.20 కోట్లు మంజూరు చేయగా, ప్రహరీ మాత్రం నిర్మించారు. మిగతా నిధులతో పనులు పెండింగ్‌లో ఉన్నాయి.

నామమాత్రంగా పోలీస్ ఔట్‌పోస్టు

పర్యాటక ప్రాంతాల్లో పర్యాటకుల రక్షణ కోసం అంటూ గత ముఖ్యమంత్రి జగన్ రాష్ట్ర వ్యాప్తంగా ఐదు పోలీస్ ఔట్‌పోస్టులను 2023 ఏప్రిల్ 14న వర్చువల్‌గా ప్రారంభించారు. వాటిలో హార్సిలీహిల్స్ ఒకటి. ఈ ప్రారంభోత్సవానికి అప్పటి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు సైతం హాజరయ్యారు. ఇకపై ఔట్‌పోస్టులో నిత్యం సిబ్బంది అందుబాటులో ఉంటూ పర్యాటకులకు రక్షణ కల్పిస్తారన్నారు. అయితే అది కార్యరూపం దాల్చలేదు. సుదూర ప్రాంతాల నుంచి కుటుంబాలతో వచ్చే పర్యాటకులకు ఆకతాయిలు, మందుబాబుల నుంచి రక్షణ కరువైంది. ఇక్కడ శాశ్వత ప్రాతిపదికన సిబ్బందిని నియమించాల్సి ఉంది.

నీటి సమస్య శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు

హార్సిలీహిల్స్‌లో శాశ్వత నీటి సమస్య పరిష్కారం దిశగా అడుగులు వేస్తున్నట్లు కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఇటీవల ప్రకటించారు. సముద్ర మట్టానికి 4312 అడుగుల ఎత్తులో ఉన్నందున ఇక్కడ బోర్లు వేసే అవకాశం లేదు. ప్రస్తుతానికి కురబలకోట మండలంలోని గాలేటివారిపల్లె వద్ద వేసిన బోర్ల నుంచి నీటిని 5 కి.మీ పైపులైన్ ద్వారా 7 దశలలో పంపింగ్ చేసి కొండ మీదకు తరలిస్తున్నారు. 40 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకం కావడంతో తరచూ సాంకేతిక సమస్యలు ఏర్పడుతున్నాయి. బోర్లలో నీరు అడుగంటితే సమస్య మరింత తీవ్రమౌతుంది. కొండపై ప్రైవేటు రెస్టారెంట్లు ట్యాంకర్ల ద్వారా నీరు కొనాల్సిందే. ఈ సమస్య పరిష్కారం కోసం హంద్రీ-నీవా కాలువ ద్వారా దిగువన ఓ చెరువును అనుసంధానం చేసి ఈ చెరువు నుంచి పంపింగ్ చేసి కొండపైకి తరలించాలని భావించారు. పైపులైను ఆధునికీకరణ, పంపింగ్ కోసం రూ.3 కోట్లతో ప్రతిపాదించారు. నిధుల కొరతతో అమలుకు నోచుకోలేదు. ఒబెరాయ్ హోటల్ లాంటి పెద్ద ప్రాజెక్టు రాబోతున్నందున పర్యాటకుల తాకిడి పెరుగుతుందని, దానికి అనుగుణంగా హంద్రీ-నీవా జలాల తరలింపు కార్యక్రమాన్ని పరిశీలిస్తామని, వాటర్‌గ్రిడ్ పరిధిలోకి హార్సిలీహిల్స్‌ను తీసుకురావడానికి చర్యలు తీసుకుంటామన్న కలెక్టర్ మాటలు కార్యరూపం దాల్చాల్సి ఉంది.

టౌన్‌షిప్ కమిటీని గాడిలో పెడతారా?

హిల్స్‌కు ఒక రకంగా పరిపాలనా కేంద్రంగా ఉన్న టౌన్‌షిప్ కమిటీని కూటమి ప్రభుత్వం గాడిలో పెట్టాల్సి ఉంది. వివాదాస్పద నిర్ణయాలను సమీక్షించాలి. ఆక్రమణలు, అక్రమ కట్టడాలను తొలగించాల్సి ఉంది. పర్యాటకుల నుంచి రూ.లక్షలు టోల్‌గేటును వసూలు చేసే కమిటీ కొండపై కనీస సదుపాయాలు కల్పించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ కమిటీ ఆధ్వర్యంలో రూ.14 లక్షలతో ఏర్పాటు చేసిన హైమాస్ లైట్లు మరమ్మతులకు గురయ్యాయి. కొండపై అదనపు మరుగుదొడ్లు నిర్మించాల్సి ఉంది. పారిశుధ్య కార్మికులు లేనందున పారిశుధ్యం లోపిస్తోంది. సబ్ కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరించే ఈ టౌన్‌షిప్ కమిటీ తరచూ సమావేశాలు, తనిఖీలు నిర్వహించి హిల్స్ సమస్యలను, అభివృద్ధి పనులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేలా చూడాల్సి ఉంది.

పేదల సొంతింటి కల నెరవేరేనా...

- జగనన్న కాలనీల్లో ఆగిన ఇళ్ల నిర్మాణాలు
- బేస్‌మెంట్లు, శ్లాబు స్థాయిలో నిలిచిపోయిన వైనం
- పట్టణంలోని 8 లేఅవుట్లలో ఇదే పరిస్థితి



చెన్నంపల్లె జగనన్న కాలనీలో పూర్తి కాని ఇళ్ల నిర్మాణాలు

బద్వేలు రూరల్, సెప్టెంబరు 13: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తాను అధికారంలో ఉన్నప్పుడు పేదలకు స్థలంతో పాటు ఇల్లు నిర్మిస్తామని ఇచ్చిన హామీ కార్యరూపం దాల్చలేదు. జగనన్న కాలనీల పేరిట లేఅవుట్లను ఏర్పాటు చేసి ఇంటి నిర్మాణాలు ప్రారంభించి దాదాపు రెండేళ్లు పూర్తయింది. కాలనీల్లో వాటర్ ట్యాంకులు, ఓవర్ హెడ్ ట్యాంకుల ద్వారా నీటి సౌకర్యం, విద్యుత్ సరఫరా ఏర్పాటు చేస్తామన్న మాటలు నీటి మూటలయ్యాయి. బద్వేలు పట్టణంలో దాదాపు నాలుగు లేఅవుట్లలో 8 వెంచర్లలో ప్రారంభమైన జగనన్న ఇళ్లు బేస్‌మెంట్లు, శ్లాబు లెవల్ వరకు అధిక సంఖ్యలో ఉండగా, పూర్తయినవి మాత్రం పది శాతం మాత్రమే ఉన్నాయి. ఇంత వరకు అన్ని లేఅవుట్లలో ఇంటి నిర్మాణాలు పూర్తికాకపోవడంతో పేద ప్రజల సొంతింటి కల కలగానే మిగిలిపోయింది.

బద్వేలు పరిధిలో నాలుగు లేఅవుట్లలోని 8 వెంచర్లలో లబ్ధిదారులకు ఇంటి స్థలాలు మంజూరు చేశారు. దాదాపు ఈ లేఅవుట్లలో 5507 మందికి ఇంటిస్థలాలు కేటా యించగా.. 4396 ఇళ్లు మంజూరయ్యాయి. అందులో ఇప్పటి వరకు 515 ఇళ్ల నిర్మాణాలు మాత్రమే పూర్తయ్యాయి. అంటే కేవలం 10 శాతం మాత్రమే ఇళ్లు పూర్తి కాగా.. 90 శాతం ఇళ్లు వివిధ స్థాయిల్లో ఆగి ఉన్నాయి. ఎప్పటికీ పూర్తవుతాయో కూడా తెలియని పరిస్థితి. దీంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు.

జగనన్న కాలనీల్లో అర్హులైన లబ్ధిదారులందరికీ 2 సెంట్లు స్థలం కేటాయించి.. ఇళ్లు నిర్మిస్తామని ఆనాటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇచ్చారు. రూ.లక్షా 80వేలకు మాత్రమే ప్రభుత్వం ఇళ్లు నిర్మిస్తుందంటూ అవసరమైతే లబ్ధిదారుడే మిగిలిన మొత్తాన్ని భరించాల్సిందంటూ మాట మార్చారు. మళ్లీ లబ్ధిదారుల నుంచి వ్యతిరేకతను గమనించి డ్వాక్రాలో జగనన్న ఇంటిని పొందిన లబ్ధిదారులకు డ్వాక్రా సంఘాల ద్వారా మరో రూ.35వేలు రుణం తీసుకోవచ్చంటూ ఆదేశాలు జారీ చేశారు. అంతా కలిపి రూ.2.15 లక్షల్లో అప్పటి ప్రభుత్వం చెప్పిన రీతిలో ఇళ్లు నిర్మించుకునే పరిస్థితి లేదని లబ్ధిదారులు చెబుతున్నారు. తాము సొంత డబ్బులు వెచ్చించి ఇంటి నిర్మాణం చేపట్టి ఇంట్లో చేరినప్పటికీ కాలనీలో మౌలిక సదుపాయాలు లేవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలపై ఆశలు పెట్టుకున్నారు.

విద్యారంగాన్ని భ్రష్టు పట్టించిన వైసీపీ : ఎమ్మెల్సీ



వేంపల్లెలోని ఉర్దూజూనియర్ కళాశాలలో విద్యార్థులకు ప్రశంసాపత్రాలను అందిస్తున్న ఎమ్మెల్సీ

వేంపల్లె, సెప్టెంబరు 13: వైసీపీ పాలనలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అవగాహనరాహిత్యం, తొందరపాటు నిర్ణయాలతో విద్యారంగాన్ని భ్రష్టుపట్టించారని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి విమర్శించారు. ఉపాధ్యాయులకు సరైన శిక్షణ, మౌలిక వసతులు లేకుండానే పాఠశాలల్లో సీబీఎస్‌ఈ ప్రవేశపెట్టారని అన్నారు. టీడీపీ ప్రభుత్వం ఈ ఏడాది సీబీఎస్‌ఈ సిలబస్‌లో కాకుండా స్టేట్ సిలబస్‌లోనే 10వ తరగతి పరీక్షలు నిర్వహించాలనే నిర్ణయం తీసుకుందన్నారు. ఆయన శుక్రవారం వేంపల్లెలోని ఉర్దూ జూనియర్ కళాశాలలో విద్యార్థులతో సమావేశమయ్యారు. ప్రభుత్వం సరఫరాచేసిన బ్యాగులను వారికి అందజేశారు. ఆటలపోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించారు. కళాశాల ఆవరణంలో ఆర్జేడీ రవి, ఆర్‌ఐఓ సుబ్బయ్యతో కలిసి మొక్కలు నాటారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం ఏర్పాటుచేసి పేద విద్యార్థులకు చదువులు అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఎలాంటి ఇబ్బందులు లేకుండా కళాశాల అభివృద్ధికి అన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సీసీకెమెరాల ఏర్పాటుకు ఆర్థిక సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. మాజీ ఎంపీటీసీ సభ్యుడు జీవీ రమణ, టీడీపీ నాయకులు పోతిరెడ్డి శివ, భానుకిరణ్, దేశం వెంకటసుబ్బారెడ్డి, మైనూరారెడ్డి, బాబా షరీఫ్, పఠాన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి చదువు-ఆటలు రెండు కళ్లలాంటివి

చక్రాయపేట, సెప్టెంబరు 13: ప్రతి విద్యార్థికి విద్యతో పాటు ఆటలు కూడా ముఖ్యమని, విద్యార్థికి విద్య విజ్ఞానాన్ని ఇస్తే... ఆటలు ఆరోగ్యాన్ని ఇస్తాయని.. విద్యతోపాటు ఆటల్లో కూడా రాణించాలని ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన శుక్రవారం అండర్-19 బాలబాలికల హ్యాండ్‌బాల్, బాస్కెట్‌బాల్, రగ్బీ, త్రోబాల్, నెట్‌బాల్ ఆటల పోటీలను గండి గురుకుల పాఠశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరిలో ఒక నైపుణ్యం ఉంటుందని.. దాన్ని వెలికితీసి రాష్ట్రస్థాయికి ఎంపిక కావాలని కోరారు. ఆర్జేడీ రవి, ఆర్‌ఐఓ వెంకటసుబ్బయ్య, స్కూల్ గేమ్ ఆర్గనైజర్ సెక్రటరీ శారద, జిల్లా క్రీడా జూనియర్ కళాశాలల గేమ్స్ అండ్ స్పోర్ట్స్ విజయప్రసాద్‌రెడ్డి, చక్రాయపేట జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ షేక్ రంతుబాషా, ఎంఈఓ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

రూ.50వేలు వితరణ: ఇటీవల గువ్వలచెరువు ఘాట్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన చక్రాయపేట వాసి డ్రైవర్ షేక్ షరీఫ్ కుటుంబాన్ని పరామర్శించి రూ.50వేలు ఆర్థికసాయాన్ని ఎమ్మెల్సీ అందించారు. బాధిత కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకునేందుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు.

సమస్యల పరిష్కారానికి ధైర్యంగా పోరాడాలి

- ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ పరిపా లన అధికారి

వేంపల్లె, సెప్టెంబరు 13: సమస్యలు వచ్చినపుడు కుంగిపోకుండా ధైర్యంగా పోరాడాలని, ఆత్మహత్య చేసుకోవడం పరిష్కారం కాదని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ పరిపాలన అధికారి పెనుగొండ రవికుమార్ తెలిపారు. ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ అమరేంద్ర కుమార్ సండ్ర, డైరెక్టర్ కుమారస్వామి గుప్త ఆదేశాల మేరకు ఆత్మహత్యల వ్యతిరేక కార్యక్రమ కౌన్సెలింగ్‌లో భాగంగా శుక్రవారం విద్యార్థినీ విద్యార్థులకు సమావేశం నిర్వహించారు. చిన్నచిన్న సంఘటనల వల్ల బాధపడకుండా తోటి స్నేహితులకు చెప్పుకోవాలని, అవసరమైతే యాజమాన్యం దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు. వ్యక్తిగత సమస్యలు ఉన్నా, కళాశాలలో సమస్యలు ఉన్నా అధ్యాపకులకు తెలియజేయాలని సూచించారు. ఎంతో మందికి దక్కని అవకాశం ట్రిపుల్‌ఐటీల్లో మీకు దక్కిందని, కష్టపడి చదువుకొని ఉన్నత ఉద్యోగ ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఏఓ సూచించారు. కార్యక్రమంలో అధికారులు రత్నకుమారి, మధుసూదన్, గోవర్దన్, తిరుపతిరెడ్డి, విశ్వనాథరెడ్డి, ఇందుమతి, సుబ్బరాయుడు, అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్య



విద్యార్థిని మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

జమ్మలమడుగు, సెప్టెంబరు 13: జమ్మలమడుగు మున్సిపాలిటీ పరిధిలోని గాయత్రినగర్‌లో శుక్రవారం ఆదిమూలపు ప్రసన్న (16) అనే విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... పట్టణంలోని ఓ ప్రైవేటు కళాశాలలో ప్రసన్న ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. గత మూడు రోజుల నుంచి కళాశాలకు వెళ్లలేదు. మధ్యాహ్నం ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కూలి పనులకు వెళ్లిన తల్లి లక్ష్మి, తండ్రి గోపాల్ ఇంటికొచ్చి చూసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి అర్బన్ పోలీసులు చేరుకుని విచారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కళాశాలకు వెళ్లడం ఇష్టం లేక ఆత్మహత్య చేసుకుందని తండ్రి తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ లింగప్ప తెలిపారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి



బాలయ్య మృతదేహం

పెండ్లిమర్రి, సెప్టెంబరు 13: కడప-పులివెందుల ప్రధాన రహదారిపై గుర్తుతెలియని వాహనం ఢీకొని బాలయ్య (55) అనే వ్యక్తి శుక్రవారం మృతి చెందాడు. స్థానికుల, పోలీసుల కథనం మేరకు తెల్లవారుజామున రోడ్డు పక్కన బహిర్భూమికి వెళ్లి కూర్చొని ఉండగా గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

సొంత అన్ననే కడతేర్చిన తమ్ముడు



మృతి చెందిన బాబా ఫక్రుద్దీన్

- మద్యం మానివేయమన్నందుకు సమ్మెటతో దాడి

పులివెందుల టౌన్, సెప్టెంబరు 13: మద్యానికి బానిస అయిన తమ్ముణ్ని మందలించినందుకు సొంత అన్ననే సమ్మెటతో కొట్టి కడతేర్చిన సంఘటన పులివెందులలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. పులివెందుల మండలంలోని రాయలాపురం గ్రామానికి చెందిన సరితాల బాబయ్య ఆలియాస్ ఎర్రోడు అనే వ్యక్తి మద్యానికి బానిసై పనిచేయకుండా తిరుగుండేవాడు. గురువారం రాత్రి అతని సోదరుడు సరితాల బాబా ఫక్రుద్దీన్ అలియాస్ బుడ్డయ్య మందలించాడు. దీంతో మానసికంగా కలత చెందిన బాబయ్య శుక్రవారం ఇంట్లో ఉన్న రాళ్లు పగలగొట్టే సమ్మెట (సుత్తె) తీసుకుని ఇంటి బయట మంచంపై పడుకుని ఉన్న బాబాఫక్రుద్దీన్‌ను కొట్టి పారిపోయాడు. దీంతో తీవ్రంగా గాయపడ్డ బాబా ఫక్రుద్దీన్‌ను పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రిలోని పోస్టుమార్టం గదికి తరలించారు. ఈసంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

యువతి అదృశ్యం

కాశినాయన సెప్టెంబరు 12: మండలంలోని నాయనపల్లెకు చెందిన దాసరి రమ్యతేజ (19) అనే యువతి అదృశ్యమైనట్లు కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలిలా.. నాయనపల్లెకు చెందిన శ్రీనివాసులు వీరసుబ్బమ్మ దంపతుల కుమార్తె రమ్యతేజ ఈనెల 10వ తేదీ ఇంటి నుంచి వెళ్లిపోయింది. బంధువులు, తెలిసినవాళ్ల ద్వారా ఆరా తీసినా ఆమూకీ లభించలేదు. యువతి తల్లి నర్సాపురం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు ఏఎస్‌ఐ రమణ తెలిపారు.

జిల్లాలో స్వచ్ఛతాహిసేవా కార్యక్రమాలు : జేసీ



స్వచ్ఛతాహిసేవ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శరాజేంద్రన్

రాయచోటి (కలెక్టరేట్) సెప్టంబరు 13: ఈనెల 17 నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమాలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి డివిజన్, మండలస్థాయి అధికారులు, మున్సిపల్, ప్రత్యేక అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమానికి డీఆర్‌ఓ సత్యనారాయణ, వివిధ జిల్లాల అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ అక్టోబర్ 2 నుంచి స్వచ్ఛభారత్ దివస్ నిర్వహించనున్న నేపథ్యంలో ఈనెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా అన్ని మున్సిపాలిటీలు, పంచాయతీలలో ఈ కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు. 15 రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని అధికారులందరు సమన్వయంతో నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రతపై మానవహారం, ర్యాలీలు, మారథన్‌రన్ తదితర కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలలో, విద్యాసంస్థలలో ప్రతిజ్ఞ పాటించి శ్రమదానం నిర్వహించాలన్నారు. ముఖ్యంగా గ్రామాలలో రోడ్లు, చెత్తకుప్పలు, బోరుబావుల చుట్టుపక్కల శుభ్రంగా వుండేలా ఒక డ్రైవ్ నిర్వహించాలన్నారు. ఎంపీడీఓలు, ఈఓఆర్‌డీలు, అర్‌డబ్ల్యూఎస్ అధికారులు, కార్యదర్శులు దృష్టి సారించాలన్నారు. అలాగే గ్రామలలో పెద్ద ఎత్తు న మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమం అనంతరం స్వచ్ఛతాహి సేవ ప్రచారం పోస్టర్లను జాయింట్ కలెక్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ, డీఆర్‌డీఏ, ఆర్‌డబ్ల్యుఎస్, పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

గృహనిర్మాణంలో లక్ష్యాలను సాధించాలి...

జిల్లాలో గత రెండు వారాలుగా గృహ నిర్మాణంలో జీరో శాతం వున్న వారు వారంలోగా లక్ష్యాలను సాధించాలని.. లక్ష్యసాధనలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులతో వారు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ గత 15 రోజులుగా గృహనిర్మాణలలో 64 సచివాలయ పరిధిలో జీరో శాతం ప్రగతి వుందన్నారు. జిల్లాలో నిమ్మనపల్లి, చిట్వేలి, మదనపల్లి అర్బన్, గుర్రంకొండ తదితర ప్రాంతాలలో ఇళ్ల నిర్మాణాలు చాలా అధ్వాన స్థితిలో ఉన్నాయన్నారు. ఎంపీడీఓలు, ప్రత్యేక అధికారులు, గృహ నిర్మాణశాఖతో సమన్వయం చేసుకుని ముందుకు సాగాలన్నారు. సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, నదియాదేవి, అర్‌డీఓ రంగస్వామి, హౌసింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కువైత్‌కు పంపిస్తానంటూ మోసం

- పోలీసులను ఆశ్రయించిన బాధితులు

కమలాపురం రూరల్, సెప్టెంబరు 13: ఎర్రగుంట్ల పట్టణానికి చెందిన గౌస్ అనే ఏజంటు తమను కువైత్‌కు పంపిస్తామంటూ మోసం చేశాడని కమలాపురం పట్టణానికి చెందిన మహబూబ్‌బాషా, షఫీ అనే బాధితులు వాపోయారు. శుక్రవారం వారు మాట్లాడుతూ కువైత్ పంపిస్తామని గౌస్ చెప్పడంతో తాము రూ.1.50 లక్షలు డబ్బులు ఇచ్చామని.. అయితే తమను కువైత్‌కు పంపకుండా.. డబ్బులు అడిగితే ఇవ్వకుండా తిప్పుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గట్టిగా నిలదీయడంతో ఎవరి డబ్బులు వారికి చెల్లిస్తానంటూ కొంతకాలం కాలయాపన చేస్తూ మిన్నకుండి పోయాడన్నారు. దీంతో ఎర్రగుంట్ల పోలీసులను ఆశ్రయించామని బాధితులు తెలిపారు. హెడ్‌కానిస్టేబుల్ ఏజంటుకు వత్తాసు పలుకుతున్నాడని వారు తెలిపారు. ఈవిషయమై అధికారులు విచారించి తమకు డబ్బులు తిరిగి ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని షఫీ, మహబూబ్‌బాషా వేడుకున్నారు.

17న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం

కడప (కలెక్టరేట్), సెప్టెంబరు 13: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఈనెల 17వ తేదీ 0-19 ఏళ్ల వయస్సు వారికి అల్బెండజోల్ మందు లు వేయడం జరుగుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ నాగరాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రక్తహీనత, ఆకలి మందగించడం, మలంలో రక్తం పడు ట, వికారం, విరేచనాలు తదితర సమస్యలు నులిపురుగుల కారణంగా వస్తాయని.. అలాంటి వారందరికీ వయసు వారీగా అల్బెండజోల్ మందులు వేస్తామని తెలిపారు. అంగన్వాడీ, పాఠశాలల్లో విద్యార్థులకు మందులు మింగించడం వల్ల నులిపరుగులను నిర్మూలన చేయవచ్చన్నారు.

ద్విచక్రవాహనం ఢీ.. మహిళ మృతి

కడప(క్రైం), సెప్టెంబరు 13: కడప నగరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజేశ్వరి(50) అనే మహిళ మృతి చెందినట్లు ఎస్‌ఐ అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ వివరాల మేరకు.. దేవుని కడపకు చెందిన రాజేశ్వరి ఎర్రముక్కపల్లెలోని బట్టల దుకాణంలో పనిచేసేది. విధులు ముగించుకుని ఇంటికెళుతుండగా ద్విచక్రవాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడింది. చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

లారీ ఢీకొని కూలీ మృతి

తాడిపత్రి, సెప్టెంబరు 13: అనంతపురం జిల్లా తాడిపత్రి మండలం ఇగుడూరు గ్రామ సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో కూలీ మృతి చెందినట్లు రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన గంగయ్య (40) మండలంలోని చుక్కలూరు గ్రామం వద్ద ఉన్న బొగ్గులబట్టీలో కూలి పని చేస్తుండేవాడు. అయితే పని నిమిత్తం ద్విచక్రవాహనంలో ఇగుడూరుకు వెళుతుండగా వాహనం మరమ్మతుకు గురికావడంతో దానిని రోడ్డు పక్కన ఆపేసి నడుచుకుంటూ వెళుతున్నాడు. ఆ సమయంలో వెనుక నుంచి గుర్తుతెలియని లారీ వేగంగా వచ్చి ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందు తూ మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నట్లు సీఐ చెప్పారు.

క్రీడాశాఖ మంత్రి సహకారంతో అంతర్జాతీయస్థాయి హాకీ స్టేడియం

- హాకీ అకాడమీ అన్నమయ్య జిల్లా సెక్రటరీ



క్రీడాశాఖ మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న నాగేశ్వరరావు

రాయచోటిటౌన్, సెప్టెంబరు 13: రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సహకారంతో రాయచోటిలో అంతర్జాతీయస్థాయి హాకీ స్టేడియం నిర్మాణానికి కృషి చేయనున్నట్లు హాకీ అకాడమీ అన్నమయ్య జిల్లా సెక్రటరీ ఇడగొట్టు నాగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన విజయవాడలోని సచివాలయంలో మంత్రి రాంప్రసాద్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి.. రాయచోటి పట్టణంలో అంతర్జాతీయస్థాయి హాకీ స్టేడియం నిర్మా ణానికి కృషి చేయాలని వినతి పత్రం అందజేశారు. రాయచోటి పట్టణంలో సుమారు 120 మంది క్రీడాకారులు హాకీ ఆడుతున్నట్లు తెలిపారు. వారికి ఇక్కడ స్టేడియం లేకపోవడంతో పాటు సరైన సౌకర్యాలు లేక హాకీక్రీడలో ఉత్తమ ప్రదర్శన ఇవ్వలేకపోతున్నారని చెప్పారు. ఇక్కడ హాకీ క్రీడాకారు లకు సరైన సౌకర్యాలు కల్పిస్తే... రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఇందుకు స్పందించిన మంత్రి మాట్లాడుతూ రాయచోటి పట్టణంలో అంతర్జాతీయస్థాయి హాకీ స్టేడియం నిర్మాణానికి కృషి చేద్దామన్నారు. కలెక్టర్‌తో చర్చించి స్టేడియం నిర్మాణానికి స్థల సేక రణ చేద్దామని మంత్రి చెప్పినట్లు ఆయన తెలియజేశారు.

వెలిగల్లు కుడికాల్వకు నీరు నిలుపుదల

గాలివీడు, సెప్టెంబరు 13: వెలిగల్లు జలాశయంలో నీటి నిల్వలు తగ్గిన దృష్ట్యా కుడికాల్వ నీటిని నిలుపుదల చేస్తున్నట్లు వెలిగల్లు ప్రాజెక్టు డీఈఈ శిరీష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. గాలివీడు, రాయచోటి మండ లాలకు విధిగా శుద్ధి చేసిన నీటిని తాగునీటి అవసరాల కోసం ఉప యోగించాల్సి ఉన్నందున కొంత నీటి నిల్వలను ఉంచుతున్నట్లు తెలిపారు. తదుపరి నీటి నిల్వలు పెరిగిన అనంతరం వ్యవసాయ అవసరాలకు సాగునీ టిని కాలువల ద్వారా విడుదల చేస్తామని తెలిపారు.

అమ్మవారి మెడలో నగ దొంగలించిన ఇద్దరు అరెస్టు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 13: రామాలయంలో అమ్మవారి మెడలో బంగారు నగ దొంగిలించిన ఇద్దరి యువకులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. పోలీసుల కథనం మేరకు మొలకదిన్నెకు చెందిన హరీష్ అలియాస్ హరి (29), సాయిప్రతాప్ అలియాస్ ప్రతాప్(25) ఈ నెల 10వ తేదీన మొలకదిన్నెలోని రామాలయంలో అమ్మవారి మెడలోని బంగారు నగ 2.1 గ్రామాలు దొంగిలించారు. వారిద్దరూ తాగుడుకు అలవాటు పడి ఆలయంలో దొంగతనాలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఆలయ పూజారి శశికాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి వారిని రిమాండ్ తరలించినట్లు సీఐ చెప్పారు.

ఆయాలకు పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలి



ఏఐటీయూసీ ఆధ్వర్యంలో డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నాలో ప్రభుత్వ పాఠశాలల ఆయాలు

రాయచోటిటౌన్, సెప్టెంబరు 13: అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలకు గత 7 నెలులగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్దిగాళ్ల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం డీఈవో కార్యాలయం వద్ద ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలకు కేవలం రూ.6వేలు జీతం ఇస్తున్నారని, అది కూడా 7 నెలలుగా ఇవ్వకపోవడంతో అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు తక్షణం స్పందించి పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పెరిగిన నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల ఆయాల వర్కర్స్ యూనియన్ నాయకులు నరసింహులు, వేణుగోపాల్‌రెడ్డి, యశోదమ్మలు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఆయాలకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని, సంవత్సరానికి రెండు జతల యూనిఫాం ఇవ్వాలని, శానిటేషన్ కార్మికులకు 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, ఈపీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయాలు యశోదమ్మ, శ్రీలక్ష్మి, వెంకటరత్నమ్మ, భారతి, విమల, నీరజా, లక్ష్మిదేవి, శంకరా, సుజాత, సంధ్య, ధనమ్మ, ఇంద్రాణి, అనీమా తదితరులు పాల్గొన్నారు.

పోలి రాఘవరెడ్డి సతీమణి మృతి


భారతి (ఫైల్ ఫొటో)

పుల్లంపేట, సెప్టెంబరు 13: వత్తలూరు పంచాయతీ తిరుమల య్యగారిపల్లెకు చెందిన ఇండియన్ అగ్రికల్చర్ సర్వీస్ బోర్డుమెంబర్ పోలి రాఘవరెడ్డి సతీమణి భారతి(73) గుండె పోటుతో మరణించారు. ఈనెల 5న అమెరికాలోని డెలావేర్‌లో గుండెపోటుతో మరణించడంతో గురువారం ఆమె మృతదేహాన్ని తిరుమలయ్యగారిపల్లెకు తీసుకువచ్చారు. శుక్రవారం ఉదయం తిరుమలయ్యగారిపల్లెలో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. డాక్టర్ పోలి రాఘవరెడ్డి గతంలో ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలర్‌గా పనిచేశారు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

ఆస్తులను కాజేయాలనే వక్ఫ్ సవరణ బిల్లు

- క్యూఆర్ కోడ్ ద్వారా జాయింట్ పార్లమెంటరీ కమిటీకి ఫిర్యాదు


వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా చేపట్టిన నిరసనలో మున్సిపల్ కౌన్సిలర్లు, వైసీపీ నేతలు, మైనార్టీలు

రాయచోటిటౌన్, సెప్టెంబరు13: ఆస్తులను కాజేయాలనే కేంద్రం వక్ఫ్ సవరణ బిల్లు తెచ్చిందని సహారా వెల్ఫేర్ సొసైటీ ఆరోపించింది. బిల్లును వ్యతిరేకిస్తూ సహారా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో రెండు రోజులుగా స్థానిక ఠాణా సర్కిల్ వద్ద క్యూఆర్‌కోడ్ ద్వారా జాయింట్ పార్లమెంటరీ కమిటీకి ఫిర్యాదులు అందిస్తున్నారు. కార్యక్రమానికి మద్దతుగా శుక్రవారం వైసీపీ మైనార్టీ విభాగం అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్ ఖాన్, మున్సిపల్ వైస్ చైర్మెన్ ఫయాజుర్ రెహమాన్, కౌన్సిలర్లు అన్నా సలీం, ఫయాజ్ అహ్మద్, షబ్బీర్ అహమ్మద్, జాకీర్, పట్టణ అధ్యక్షుడు రియాజుర్ రెహమాన్, బేపారి జబీబుల్లాఖాన్ కమిటీకి ఫిర్యాదు చేశారు. చట్ట సవరణ ద్వారా వక్ఫ్ ఆస్తులను కార్పొరేట్ సంస్థలకు కేటాయించి ముస్లింల ఆస్తులను అన్యాక్రాంతం చేయాలని బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని వారు ఆరోపించారు. ముస్లిం మనోభావాలు దెబ్బతినకుండా ఉన్న చట్టాలను అమలు చేయాలని, లేని పక్షంలో వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు.

సీఎం చంద్రబాబుకు రూ.4.43 లక్షలు చెక్కు అందజేత


ముఖ్యమంత్రికి సీఎం సహాయనిధి చెక్కు అందజేత

సిద్దవటం, సెప్టెంబరు 13: మండలం టీడీపీ తరఫున శుక్రవారం వరద బాధితులకు ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ.4.43 లక్షల చెక్కును మండల పార్టీ అధ్యక్షుడు శనివారపు మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి నారా చంద్రబాబుకు అందజేశారు. వరద కారణంగా నష్టపోయిన ప్రతి కుటుంబానికీ ముఖ్యమంత్రి అహర్నిశలు కష్టపడుతూ ప్రజలను అన్నివిధాలా ఆదుకుంటున్నారన్నారు. మండల పార్టీ తరఫున మనవంతు సహాయ సహకారం చేశామన్నారు. కార్యక్రమంలో మాజీ మండల ప్రెసిడెంట్ నరసింహారెడ్డి, మాజీ మండల కన్వీనర్ మామిడి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించండి

సిద్దవటం, సెప్టెంబరు 13: ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించడంతో అధిక దిగుబడులు వస్తాయని మండల వ్యవసాయాధికారి సీకే రమేష్‌రెడ్డి తెలిపారు. టక్కోలు రైతుసేవా కేంద్రం లింగంపల్లెలో నిర్వహించిన పొలంబడిలో రైతులు వరినారు కొనలు తుంచి నాటడం, కాలిబాటల గురించి అవగాహన కల్పించారు. 2 ఎకరాల అధ్యయన క్షేత్రంలో ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించడం, సుడోమోనాస్ క్లోర్ పైరిపోస్ వాడకంపై అవగాహన, ఉత్తమ యాజమాన్య పద్ధతులు పాటించిన రైతులకు స్కోప్ సర్టిఫికెట్ ఏపీఎస్ఓపీసీఏ ద్వారా అందిస్తామన్నారు. 14 వారాలు పొలంబడిలో పాల్గొని అధికారులు సూచనలు పాటించాలి. గట్లమీద చెండుమల్లి, ఆముదం, కంది పంటలు సాగుచేసినా అదనపు ఆదాయం వస్తుంది. టక్కోలు రైతు సేవాకేంద్రం వ్యవసాయ సహాయకులు ఆకుల శివ ఫణీంద్ర, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది చిన్నక్క, సింగరయ్య, ఐసీఆర్పీలు సుమలత, పద్మావతి, లక్ష్మీదేవి, భాగ్యలక్ష్మీ, పొలంబడి రైతులు పి.రామ్మూర్తి, గంగిరెడ్డి, రాజోలి గంగయ్య, మేకల మునెయ్య, నాగెళ్ల అంకిరెడ్డి పాల్గొన్నారు.

సీతారాం ఏచూరి మృతి పట్ల సంతాపం

ఓబులవారిపల్లె/చిట్వేలి/రైల్వేకోడూరు, సెప్టెంబరు 13: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం బాధాకరమని ఆయన చిత్రపటానికి మంగంపేటలో సీఐటీయూ జిల్లా నేత, కార్మిక పోరాట కమిటీ నేత, సీహెచ్ చంద్రశేఖర్ నివాళులర్పించారు. పేద, బడుగు బలహీన వర్గాల కోసం నిరంతరం పోరాడిన పోరాట యోధుడన్నారు. పందికాళ్ల మణి, ఏపీఎండీసీ ఔట్‌సోర్సింగ్, ట్రైనీ కార్మిక పోరాట యూనియన్ తరఫున సంతాపం, ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామని కార్మిక పోరాట కమిటీ కన్వీనర్ వెంకటేశ్ తెలిపారు. ఏపీఎంసీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఏచూరి మృతికి సంతాపం వ్యక్తం చేశారు. ఏపీఎంసీ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పోకూరి మురళి, ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి గంగాధర్, ఎంప్లాయీస్ యూనియన్ నేత కృష్ణచైతన్య, మంగంపేట రీ హ్యాబిటేషన్ యూనియన్ అధ్యక్షుడు సగినాల సుబ్రమణ్యం, పాల్గొన్నారు. చిట్వేలి ఎంఈఓ కార్యాలయ ప్రాంగణంలో ఏచూరి చిత్రపటానికి సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ నివాళులర్పించారు. రైల్వేకోడూరు సీఐటీయూ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. జిల్లా సీఐటీయూ అధ్యక్షుడు సీహెచ్, సి. పుల్లయ్య, జాన్‌ప్రసాద్, ప్రసాద్, రాజశేఖర్, సిద్ధూ, మల్లి, మహిళా నాయకురాళ్లు రమాదేవి, రాధాకుమారి, దుర్గ తదితరులు నివాళులర్పించారు.

గంగ ఒడికి గణనాథుడు

- ఉండ్రాలయ్యా ఇక సెలవయ్య
- ఊరూరా నిమజ్జనాలు
- వేడుకగా సంబరాలు
- గణనాథుని సన్నిధిలో అన్నదానం

సంబేపల్లె, సెప్టెంబరు13: మండల వ్యాప్తంగా వినాయక ప్రతిమలను ఏడో రోజు నిమజ్జనం చేశారు. ఊరూరా నిమజ్జనాల కార్యక్రమం వేడుకగా సాగింది. అనేక చోట్ల గణనాథుల మండపాల వద్ద భారీగా అన్నదానం నిర్వహించారు. అడవికమ్మపల్లె, బోయపల్లి, ఇందిరానగర్‌కాలనీ, అంబేడ్కర్‌నగర్ కాలనీ, సంబేపల్లె సంతరూటు సహా పలుచోట్ల ప్రత్యేక పూజలు చేపట్టారు. ట్రాక్టర్‌పై గణనాథుడిని పురవీధుల్లో ఊరేగించి కాయకర్పూరం సమర్పించి భక్తిని చాటుకున్నారు. సంబేపల్లె వినాయక మండపం వద్ద మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తనయుడు నిశ్చల్ నాగిరెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. యువత, మహిళలు, పెద్దలు ప్రతి ఒక్కరూ రంగులు చల్లుకుని ఉత్సాహంగా స్వామి వారి నిమజ్జనంలో పాల్గొన్నారు. అనంతరం సమీపంలోని కుంటలో గణనాథుడిని గంగ వడికి చేర్చి జై బోలో గణేశ్ మహరాజ్‌కి జై అంటూ నినాదాలు చేస్తూ స్వామి వారి నిమజ్జనం చేపట్టారు.

కుమ్మరపల్లెలో సంబరాలు

నందలూరు, సెప్టెంబరు 13: కుమ్మరపల్లెలో వినాయక మండపం వద్ద శుక్రవారం ఘనంగా సంబరాలు నిర్వహించారు. చిన్నపిల్లలు ఆటపాటలతో అలరించారు. చిగురుపాటి గణేష్ లడ్డూను దక్కించుకున్నారు. గుర్రంకొండ మహేష్ ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్, శ్రీనివాసులు, రాచయ్య, జీవీఎస్, మహేష్ రెడ్డి, కృష్ణయ్య, శంకరయ్య, కమిటీ యూత్ దీపు, రాంబాబు, ఫణీ, కాశీ, రమేష్, భరత్, సాయి, రామలక్ష్మణ్, మదన్, భార్గవ్ తదితరులు పాల్గొన్నారు.



వినాయక నగర్‌లో అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం - లక్కిరెడ్డిపల్లెలో అన్నదానంలో పాల్గొన్న ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్‌రెడ్డి

ఒంటిమిట్టలో...

ఒంటిమిట్ట, సెప్టెంబరు 13: మండలంలో ఏర్పాటు చేసిన గణనాథులకు ఏడోరోజు ఘనంగా నిమజ్జనం చేపట్టారు. శుక్రవారం కల్లా వీధి, మాడవీధుల్లో ఏర్పాటు చేసిన గణనాథులకు నిమజ్జనం చేశారు. గణనాథుని వెంట బాజాభజంత్రీలు, డీజే ఏర్పాటు చేసి ఉత్సాహంగా యువత కేరింతలతో గణనాథుడికి వీడ్కోలు పలికారు.

పుల్లంపేటలో....

పుల్లంపేట, సెప్టెంబరు 13: స్థానిక శివపార్వతినగర్‌లో వెలసిన వినాయక ప్రతిమను వైభవంగా నిమజ్జనానికి తరలించారు. పురవీధుల్లో డప్పులు వాయిస్తూ బాణసంచా పేల్చి గ్రామోత్సవం నిర్వహించి వేల్పులవారిపల్లె కుంటలో నిమజ్జనం చేశారు.


సంబేపల్లెలో నిమజ్జనానికి తరలుతున్న వినాయక ప్రతిమలు

వినాయక నగర్‌లో అన్నదానం

సుండుపల్లె, సెప్టెంబరు13: వినాయక నగర్‌లో చవితి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అన్నదానం నిర్వహించారు. ఏటా వైభవంగా చవితి ఉత్సవాలను నిర్వహిస్తున్నామని ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. కార్తికేయనగర్‌లో వినాయక చవితి మండపం వద్ద అన్నదానం నిర్వహించారు. ఆదివారం వినాయక ప్రతిమలను నిమజ్జనం చేస్తామన్నారు.

గణనాథుని సన్నిధిలో...

లక్కిరెడ్డిపల్లె సెప్టెంబరు13: లక్కిరెడ్డిపల్లె మూడు రోడ్ల కూడలిలో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమ మండపం వద్ద ఎంపీపీ మద్దిరేవుల సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులు శుక్రవారం పూజలు నిర్వహించారు. గణనాథునికి గజమాల సమర్పించి పూజలు నిర్వహించి అన్నదానం ఏర్పాటు చేశారు. మండలంలో అనంతపురం, ఈడిగపల్లె, దిన్నెపాడు, వడ్డెపల్లె, రెడ్డివారిపల్లె గ్రామాల్లో నిమజ్జనం నిర్వహించారు.

కన్నులపండువగా కార్యసిద్ధి వినాయకుని కల్యాణోత్సవం


కల్యాణోత్సవం నిర్వహిస్తున్న తలమంచి కుటుంబ సభ్యులు

పెనగలూరు, సెప్టెంబరు 13: పి.కొత్తపల్లెలో కార్యసిద్ధి వినాయకస్వామి ఉత్సవాలు వేడుకగా జరిగాయి. శుక్రవారం రాత్రి తలమంచి గిరీష్‌రెడ్డి, మాధవి, పవన్‌కుమార్‌రెడ్డి, అనన్య, తలమంచి చంద్రబాబురెడ్డి, ధనుంజయ రెడ్డి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో సిద్ది బుద్ధి సమేత కార్యసిద్ధి వినాయకస్వామి కల్యాణోత్సవం వేడుకగా జరిగింది. టీటీడీ వేదపండితుల బృందం జొన్నవిత్తుల వెంకటరామ శర్మ, జూటూరు నరసింహాశర్మ ఆధ్వర్యంలో కల్యాణోత్సవం జరిగింది. భక్తులకు అల్పాహార ప్రసాదం పంపిణీ చేశారు. బాణసంచా పేలుళ్ల కన్నులవిందుగా సాగింది. గిరీష్‌రెడ్డి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన కల్యాణోత్సవం కాణిపాకం వెళ్లిన అనుభూతిని కలిగించిందని పలువురు చర్చించు కున్నారు. కార్యక్రమంలో పలురకాల విచిత్ర వేష ధారులు భక్తులను ఆహ్వానించారు. రాజకీయ ప్రముఖులు, భారీఎత్తున పరిసర ప్రాంతాల ప్రజలు హాజరయ్యారు.

జంతువులకు టీకాలు వేయాలి

నందలూరు, సెప్టెంబరు 13: జంతువులకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి డాక్టర్ గుణశేఖర్‌పిళ్లై రైతులకు సూచించారు. శుక్రవారం పొత్తపి గ్రామంలోని గేదెలను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ కలుషిత తాగునీరు, దోమకాటు, పాడి పశువుల్లో గొంతువాపు వ్యాధికి కారణమవుతుందన్నారు. ఈ వ్యాధికి సరైన చికిత్స అందకపోతే మరణించే అవకాశం ఉందన్నారు. టీకాలు తప్పక వేయించాలని సూచించారు. జిల్లా పశువ్యాధుల నిర్ధారణ అధికారి డాక్టర్ రాజశేఖర్, అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ప్రతాప్, పశువైద్యాధికారి అశ్విని పాల్గొన్నారు.

అటవీ శివారు ప్రాంతాల్లో సుగవాసి పర్యటన

రాజంపేట, సెప్టెంబరు 13: మండలంలోని అటవీ ప్రాంతాలైన చింతలకోన, బగ్గిడిపల్లె, నూతివారిపల్లెల్లో శుక్రవారం రాజంపేట టీడీపీ నియోజకవర్గ నేత సుగవాసి బాలసుబ్రమణ్యం సుడిగాలి పర్యటన చేశారు. రాజంపేట తహసీల్దారు మహబూబ్‌చాంద్, ఫారెస్ట్ రేంజి అధికారి నారాయణ, స్థానిక గ్రామ అధికారులతో కలిసి ప్రజలతో సమావేశమయ్యారు. 707 సర్వే నంబరులోని వ్యవసాయ భూములన్నింటినీ రైతులకు పట్టాలు కల్పించాలని ప్రజలు సుగవాసికి విజ్ఞప్తి చేశారు. అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయినప్పుడు సర్వస్వం కోల్పోయామని, రైతుల అనుభవం కింద ఉండే 707 సర్వేనంబరు భూములను తమకు కేటాయిస్తే వ్యవసాయం చేసుకుని జీవిస్తామని వారు కోరారు. ఈ సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి స్థానిక ప్రజలకు ఇచ్చేలా కృషి చేస్తానని తెలియజేశారు. కార్యక్రమంలో రాజంపేట పార్లమెంట్ జనసేన నేతలు రామా శ్రీనివాస్, టీడీపీ నాయకులు కొండా శ్రీనివాసులు, సిద్దనాగయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కిశోర బాలికలు వ్యక్తిగత శుభ్రత పాటించాలి

లక్కిరెడ్డిపల్లె సెప్టంబర13: కిశోర బాలికలు వ్యక్తి గత శుభ్రతను పాటించాలని ఆరోగ్య విస్తరణాధికారి దేవదానం సూచించారు. శుక్రవారం స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయంలో బాలికలకు హిమోగ్లోబిన్ శాతాన్ని పరిశీలించారు. కిశోర బాలికలు సమతుల్య ఆహారం తీసుకుని రక్త శాతాన్ని పెంచుకోవాలన్నారు. వ్యక్తిగత శుభ్రత పాటించడం వలన అంటు వ్యాధులు దూరమవుతాయన్నారు. సీహెచ్ఓ శివరంజని ఆరోగ్య కార్యకర్త, ఆశావర్కర్లు పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు

ఘనంగా నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలు

రైల్వేకోడూరు, సెప్టెంబరు 13: మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలు శుక్రవారం రైల్వేకోడూరులో బీజేపీ నేతలు ఘనంగా నిర్వహించారు. కేక్ కత్తిరించి అభిమానులు, నేతలు, కార్యకర్తలకు పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు వాకచర్ల సుబ్బారావు, ఆయపాటి గౌరీ కుమార్, సాయిఆచారి, ప్రశాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గంధ మహోత్సవం

సిద్దవటం, సెప్టెంబరు 13: ఎగువపేట ఫత్తుమియా మసీదు వద్ద ఆసార్-ఎ-షరీఫ్ ఉరుసు మహోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి గంధ మహోత్సవాన్ని పీఠాధిపతి సయ్యద్ అబ్దుల్ అజీజ్‌ఖాద్రి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. గంధ మహోత్సవం ఆసార్-ఎ-షరీఫ్‌లో తయారు చేసిన దర్గాలో అర్పించి ఫాతేహా నిర్వహించారు. గంధ మహోత్సవంలో సిద్దవటం తహసీల్దారు మురాషావలి పాల్గొన్నారు. మిలాద్-ఉన్-నబీ ఉత్సవాల్లో భాగంగా ఏటా ఆసార్-ఎ-షరీఫ్ మహోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. శనివారం తెల్లవారుజాము నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు మహ్మద్ ప్రవక్త వస్తు విశేషాలను భక్తుల ముందు ప్రదర్శిస్తారు. మహ్మద్ ప్రవక్త విశేషాలను తిలకించేందుకు జిల్లా నుంచే గాకుండా ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులు కూడా వచ్చి తిలకిస్తుంటారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ఒంటిమిట్ట సీఐ కృష్ణంరాజునాయక్ ఆధ్వర్యంలో సిద్దవటం ఎస్ఐ చిరంజీవి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థులు

హ్యాండ్‌బాల్, రగ్బీ క్రీడలకు ఎంపిక



లక్కిరెడ్డిపల్లె సెప్టంబరు13: గండి బాలుర గురుకుల పాఠశాలలో శుక్రవారం జరిగిన జిల్లా స్థాయి క్రీడల్లో ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ కోమటిరెడ్డి శివశంకర్‌రెడ్డి తెలిపారు. హ్యాండ్‌బాల్ లక్ష్మి, స్వప్న, రగ్బీలో ఓం ప్రసన్న ఎంపికయ్యారని తెలిపారు. వీరు రాష్ట్ర స్థాయిలో జరిగే క్రీడల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. పిజికల్ డైరక్టర్ సోమశేఖర్ నాయక్, అధ్యాపకులు నిత్యపూజయ్య, సుధాకర్, శ్రీనివాసులు, రాజ్‌కుమార్, నాగయ్య, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.

నియోజకవర్గ స్థాయికి ఎంపికైన క్రీడాకారులు

రామాపురం, సెప్టెంబరు13: అండర్-14, అండర్-17 కేటగిరీల్లో బాలుర, బాలికలకు కబడ్డీ, వాలీబాల్ నియోజకవర్గ స్థాయి పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేశారు. 12, 13 తేదీల్లో నీలకంఠ్రావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీలు నిర్వహించారు. నియోజకవర్గ స్థాయిలో ఎంపికైన క్రీడాకారుల పేర్లను జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం సుజాత, పీడీ నరేంద్రకుమార్‌రెడ్డి ప్రకటించారు. అండర్-17 వాలీబాల్‌లో డాక్టర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు విన్నర్లుగా, జడ్పీహైస్కూల్ కొండవాండ్లపల్లి విద్యార్థులు రన్నర్‌గా నిలిచారు. అండర్-14లో నీలకంఠ్రావుపేట జడ్పీహైస్కూల్ (ఉర్దూ)విన్నర్‌గా, (తెలుగు) విద్యార్థులు రన్నర్‌గా నిలిచారు. కబడ్డీలో అండర్-14,17 బాలుర విభాగంలో డాక్టర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు విన్నర్‌గా నిలిచారు.

ముగిసిన క్రీడా పోటీలు

నందలూరు, సెప్టెంబరు 13: అరవపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) మండల స్థాయి క్రీడా పోటీలు ముగిశాయి. హెచ్‌ఎం శ్రీనివాసులు, స్కూల్‌గేమ్స్ మండల కోఆర్డినేటర్ కృష్ణయ్య, అసిస్టెంట్ హెచ్‌ఎం షేక్ రౌఫ్‌బాషా మాట్లాడుతూ అండర్-14, 17 విభాగాల్లో విడివిడిగా బాల బాలికలకు చెస్, యోగా, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించామన్నారు. ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ గౌరీ, సరిత, సుష్మిత, విశ్వనాథ్, జగన్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మండలస్థాయి పోటీలు...

చిట్వేలి, సెప్టెంబరు 13: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి పోటీలు శుక్రవారం ముగిశాయి. మండలస్థాయి చైర్మన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పురుషోత్తమరెడ్డి, మండల కోఆర్డినేటర్ షబ్బీర్‌అహ్మద్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. బాలబాలికల వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్ పరుగు పందెం, లాంగ్‌జంప్, హైజంప్, చదరంగం, షటిల్‌బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

హ్యాండ్ బాల్ జిల్లా జట్టుకు సుండుపల్లె బాలికలు

సుండుపల్లె, సెప్టెంబరు13: ఉమ్మడి కడప జిల్లా అండర్-19 బాలికల జట్టుకు సుండుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బాలికలు ముగ్గురు ఎంపికయ్యారు. శుక్రవారం గండి గురుకుల పాఠశాలలో ఎస్‌జీఎఫ్ఐ అండర్-19 విభాగంలో జిల్లా స్థాయి జట్ల ఎంపికలు నిర్వహించారు. సుండుపల్లె ఉన్నత పాఠశాల బాలికలు పల్లవి, జాహ్నవి, అహన ప్రతిభ కనపరిచారు. సుండుపల్లె ఉన్నత పాఠశాల బాలికలకు చోటు దక్కిందని వ్యాయామ ఉపాధ్యాయురాలు రాధారాణి తెలిపారు. సెలెక్టర్లు ఎస్‌జీఎఫ్ఐ అండర్-19 జిల్లా జట్టులో స్థానం పొందిన బాలికలను అభినందించారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు గడువు పెంపు

రాయచోటిటౌన్, సెప్టెంబరు13: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఏపీ ఓపెన్ స్కూల్) 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి టెన్త్, ఇంటర్ కోర్సుల్లో ప్రవేశాలకు గడువు పొడిగించినట్లు అన్నమయ్య జిల్లా విద్యాశాఖాధికారి శివప్రకాశ్‌రెడ్డి, ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజు ప్రకటించారు. టెన్త్, ఇంటర్ ఓపెన్ స్కూల్ ద్వారా చదవాలనుకునే అభ్యర్థులు ఎటువంటి అపరాధ రుసుం లేకుండా 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.200 అపరాధ రుసుముతో 25వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. అన్నమయ్య జిల్లా పరిధిలోని అన్ని మండలాల్లో ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్లు ఉన్నాయని, వాటి ద్వారా దరఖాస్తు చేసుకుని విద్యార్హత పొందాలని వారు తెలియజేశారు. అర్హత గల అభ్యర్థులు (డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. ఏపీ ఓపెన్ స్కూల్.ఏపీ. గవర్నమెంట్ ఇన్) వెబ్‌సైట్‌లో చూసుకోవాలన్నారు.

పరిశీలించి న్యాయం చేస్తాం

ఓబులవారిపల్లె, సెప్టెంబరు 13: గిరిజనుల భూములను అగ్రవర్ణాలవారు ఆక్రమించుకున్నారని రాజంపేట సబ్‌కలెక్టర్‌కు అందించిన ఫిర్యాదును పరిశీలించి న్యాయం చేస్తామని తహసీల్దార్ పీర్ మున్ని తెలిపారు. గతంలో ప్రభుత్వం ద్వారా ఇచ్చిన భూమిని గిరిజన కుటుంబాల నుంచి అక్రమంగా ఆక్రమించుకుని దౌర్జన్యం చేస్తున్నారని ఫిర్యాదు చేసినా అర్జీదారులతో గ్రామంలో రెవెన్యూ సిబ్బందితో కలిసి విచారించారని తహసీల్దారు తెలిపారు.

సరస్వతీ తల్లి విగ్రహం ఏర్పాటు

సంబేపల్లె, సెప్టెంబరు13: అడవికమ్మపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పరుచూరి బాలాజీ దంపతులు సరస్వతీ తల్లి విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. విద్యార్థులు సరస్వతీ మాతకు పూజలు నిర్వహించి చదవాలని సూచించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య గ్రామస్తుల సహకారంతో విగ్రహం ఏర్పాటు చేశారు.

రేపు టీడీపీ కార్యాలయం ప్రారంభం

లక్కిరెడ్డిపల్లె సెప్టంబరు13: లక్కిరెడ్డిపల్లెలో టీడీపీ కార్యాలయాన్ని సోమవారం మంత్రి మండిపల్లె రామ్‌ప్రసాద్ రెడ్డి ప్రారంభిస్తారని మండల యువనేత మాజీ ఎంపీటీసీ యనమల మదన్‌మోహన్ తెలిపారు. నూతన కార్యాలయం ప్రాంభోత్సవం అనంతరం గొప్ప బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. సందర్భంగా బహిరంగ సభ ఏర్పాట్లను ఎస్ఐ రవీంద్రబాబు పరిశీలించారు. టీడీపీ కార్యకర్తలు పాల్గొనాలని, సమస్యలు మంత్రికి తెలియజేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు మురళి, ముక్తార్, కావలి ఆంజనేయులు, వేణు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

పెనగలూరు, సెప్టెంబరు 13: విద్యుత్‌స్టేషన్లలో మరమ్మతులు, లైన్ల కింద చెట్ల తొలగింపులో భాగంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ సయ్యద్ షఫీ తెలిపారు. కొండూరు, తిమ్మయ్యగారిపల్లె, బెస్తపల్లె, పెనగలూరు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తారన్నారు.

సబ్‌స్టేషన్ పరిధిలో...

సిద్దవటం, సెప్టెంబరు 13: మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ జయచంద్ర తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలో 33/11కెవి లైనుకు మరమ్మతులు చేపడుతున్న శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

హమాలీలకు జీతాలు చెల్లించాలి

రాయచోటి(కలెక్టరేట్)సెప్టెంబరు13: జిల్లాలోని సివిల్ సప్లై హమాలీలకు జీతాలు చెల్లించడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారని, ప్రతి నెలా 13 తేదీ అవుతున్నా జీతాలు చెల్లింపుల్లో అధికారుల తీరు బాగోలేదని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ అన్నారు. శుక్రవారం స్థానిక సివిల్‌సప్లై గోడౌన్ ఎదుట హమాలీలతో నిరసన చేపట్టిన వారు మాట్లాడుతూ కడుపు కోసం నిత్యం మూటలు మోసి కాయకష్టం చేస్తున్న వారికి నెల నెలా జీతాలు పెట్టడంలో అలస్యం చేయడం సమంజసం కాదన్నారు. కలెక్టర్ చొరవ తీసుకుని జీతాలు సరైనా వేళకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

తాగునీటి సమస్య తీర్చిన మంత్రి

రామాపురం, సెప్టెంబరు13: చిట్లూరు గ్రామం చెరువు ముందరపల్లికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తాగునీటి సమస్యను తీర్చారు. కొంత కాలంగా తాగునీటి సమస్యతో గ్రామస్తులు ఇబ్బంది పడుతుండడంతో గ్రామస్తులు ఈ విషయాన్ని మంత్రి మండిపల్లి దృష్టికి తీసుకుపోవడంతో వెంటనే స్పందించి ప్రత్యేక నిధులతో గ్రామానికి కొత్తగా పైపులైన్ వేయించారని గ్రామస్తులు తెలిపారు.

ఆడ పిల్లలకు దుస్తులు పంపిణీ

రైల్వేకోడూరు, సెప్టెంబరు 13: వరద బాధితులు బాలబాలికలకు జనసేన నేత యనమల భాస్కర్‌రావు దుస్తులు పంపిణీ చేశారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పిలుపు మేరకు విజయవాడ ప్రాంతాల్లో తిరిగిన ఆయన మాట్లాడుతూ విజయవాడ వరదల్లో చాలా మంది ఇండ్లు తదితర వాటిని కోల్పోయినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం వరదల్లో విశేషంగా పని చేసిందన్నారు. దాతలు వరద ప్రాంతాలకు సాయం అందించారని తెలిపారు.

ఈ - పంట కీలకం.. ప్రామాణికం

- రైతులు సాగు వివరాలు తెలపాలి
- రేపటి వరకే గడువు

సుండుపల్లి, సెప్టెంబర్ 13: అతివృష్టి, అనావృష్టి, నకిలీ విత్తనాలు, గిట్టుబాటు ధరల్లేమి ఇతర సమస్యలతో రైతులు నిత్యం సతమతమవుతున్నారు. పండించిన పంటకు మద్దతు ధర దక్కడం లేదు. వ్యయ ప్రయాసలకోర్చి సాగు చేపట్టిన అన్నదాతలకు పంట ఇంటికొస్తుందనే నమ్మకం కుదరడం లేదు. విపత్కర పరిస్థితుల్లో రైతులకు అండగా నిలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ పంట నమోదుతో సహాయకారిగా నిలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సాగు వివరాలను యూనిఫైడ్ డిజిటల్ ప్లాట్ ఫాం(యూడీపీ) నమోదు చేయిస్తోంది. మండలంలో సుమారు 37,400 ఎకరాల సాగు భూమి వుంది. ఖరీఫ్‌లో ఈ ఏడాది వ్యవసాయ శాఖ, ఉద్యాన శాఖకు సంబంధించి పంటల సాగు సుమారు 8,500 ఎకరాలు కాగా, ఇప్పటి వరకు 3,074 మంది రైతులకు 7,717 ఎకరాల సాగుచేసిన పంట పొలాలకు ఈ పంట నమోదు చేసినట్లు అధికారులు చెబుతున్నారు.

ఎవరిని సంప్రదించాలంటే...

తొలుత గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో పంట వివరాలను వ్యవసాయ సిబ్బందికి తెలియజేయాలి. సాగు చేసిన పంట రకం, విస్తీర్ణం, సర్వే నెంబరు, పాసు పుస్తకం, ఆధార్, సెల్ నెంబరు ఇవ్వాలి. దాంతో ఆభూమి జియో ఫెన్సింగ్ అవుతుంది. వ్యవసాయ సిబ్బంది పొలానికి వెళ్లి పంట ఫొటోలు తీసి ఈ-పంట యాప్‌లో నమోదు చేస్తారు. తర్వాత రైతు సెల్‌కు ధ్రువ పత్రం వస్తుంది. ఇదే రైతులకు ఆధారం. దీని ద్వారానే పంట నష్టపరిహారం, రాయితీలు పొందడానికి వీలవుతుంది. లబ్ధి అందకుంటే ఉన్నతాధికారులను ప్రశ్నించడానికి వీలవుతుంది.

ప్రయోజనాలివీ...

ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేసే ఏపథకమైనా, ప్రయోజనమైనా ఈ-పంటలో నమోదైతేనే రైతుకు లబ్ధిచేకూరుతుంది. ఉచిత పంట బీమా, పెట్టుబడి రాయితీ, ఉత్పత్తుల కొనుగోలు తదితరాలన్నీ సవ్యంగా సాగుతాయి. ఒకవేళ యాప్‌లో వివరాలు నమోదు కాకుంటే పండిన పంటనూ విక్రయించడం కష్టమే. రైతులు అప్రమతంగా ఉంటూ ఈ-పంటలో వివరాలన్నీ సక్రమంగా నమోదు చేయించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

రేపటితో చివరి గడువు

మహబూబ్ బాషా, ఏఓ సుండుపల్లి

పంటలు సాగు చేస్తున్న ప్రతి రైతూ ఈ-పంటలో తప్పనిసరిగా వివరాలు నమోదు చేయించుకోవాలి. సమస్యలు ఎదురైతే ఎప్పటికప్పుడు సమీక్షించి పరిష్కరిస్తున్నాము. మండలంలో 80 శాతం ఈ-పంట నమోదు పూర్తయింది. 14 గ్రామాల్లో రెవెన్యూ సిబ్బంది ఇప్పటికే రైతులకు సమాచారం ఇచ్చారు. ఈ-పంటలో సాగు వివరాలు నమోదు కాకుంటే రైతులకు ప్రభుత్వ పథకాలు అందవు.

కోలాహలంగా 'బొజ్జ గణపయ్య' నిమజ్జనోత్సవం

● 4లక్షల 11 రూపాయలకు లడ్డూ ప్రసాదం దక్కించుకున్న చిత్తూరు ఎమ్మెల్యే




డీఐ రోడ్డులో శివశక్తి వినాయక నిమజ్జనంలో స్వామివారి ఊరేగింపు - లడ్డూ ప్రసాదంతో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్, దొరబాబు తదితరులు

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 13: చిత్తూరు నగరంలోని డీఐ రోడ్డులో ఏర్పాటు చేసిన ఐదు గణేశుడి ప్రతిమలను శుక్రవారం వైభవంగా నిమజ్జనం చేశారు. ఈ ఉత్సవానికి చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శివశక్తి వినాయకుడికి నైవేద్యంగా సమర్పించిన లడ్డూ ప్రసాదాన్ని 4లక్షల 11 రూపాయలకు ఎమ్మెల్యే దక్కించుకున్నారు. ఈయన తరఫున మాజీ కార్పొరేటర్ వసంతనాయుడు వేలం పాట పాడారు. అనంతరం లడ్డూ ప్రసాదాన్ని భక్తులకు ఎమ్మెల్యే పంచి పెట్టారు. అనంతరం ఐదు వినాయక ప్రతిమలను మేళతాళాలు, బాణసంచా వేడుకలతో ఊరేగిస్తూ కట్టమంచి చెరువు వద్దకు తీసుకొచ్చి నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు కఠారి హేమలత, దొరబాబుల తోపాటు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



కళాకారుల సందడి

తెలుగు భాష ఆయన శ్వాస

● స.వెం. రమేశ్‌కు నేడు బొమ్మిడాల పురస్కారం



ఆయన పుట్టి పెరిగింది తమిళనాట. కానీ జన్మమూలాల అమ్మభాష అయిన తెలుగే శ్వాసగా తపిస్తున్నారు. భాషా రాష్ట్రాల పేరుతో తెలుగు భాష, సంస్కృతులకు కలిగిన ముప్పును వివరిస్తూ, కాపాడుకుందామంటూ ఉద్యమకారుడిగా అలుపెరగని ప్రయాణం సాగిస్తున్నారు. ఎల్లలకు ఆవల ఉన్న తెలుగుదనాన్ని లోకానికి చాటుతున్నారు. తెలుగు పరిశోధకుడిగా దేశదేశాలు పర్యటిస్తున్నారు స.వెం.రమేశ్. ఆయన చేస్తున్న విశేష కృషికి గుంటూరుకు చెందిన బొమ్మిడాల కృష్ణమూర్తి ఫౌండేషన్ అత్యున్నత పురస్కారాన్ని ప్రకటించింది. శ్రీకాళహస్తి కేంద్రంగా చేసుకుని ప్రస్తుతం తెలుగు భాషోద్యమం నడుపుతున్న స.వెం.రమేశ్‌కు గుంటూరులో నేటి సాయంత్రం జరిగే ప్రత్యేక సభలో బొమ్మిడాల పురస్కారం అందజేస్తారు.

గురువు పుష్పరాజ్ సహా ఏడుగురితో ఏర్పడిన తెలుగువాణి సంస్థ ద్వారా స.వెం.రమేశ్ తమిళనాడులోని వేలూరు ప్రాంతంలో తెలుగు తరగతులను ప్రారంభించారు. అనేక తెలుగు పల్లెల్లో తిరిగి తెలుగు రాయడం చదవడం నేర్పించారు. వేలూరు పరిసరాల్లోని 80 గ్రామాల్లో నాలుగు వేల మంది తెలుగు నేర్చుకున్నారు. వారిలో కొందరు తెలుగులో కథారచయితలుగా, కవులుగా మారారు. ఆ తరువాత కంచి, హోసూరు, తిరవళ్లూరు తదితర ప్రాంతాల్లో తెలుగు ఉద్యమాన్ని నడిపించి అక్కడి భాషాభిమానుల్లో ఉత్తేజం నింపారు. ఇక ప్రపంచ నలుమూలల్లోని తెలుగువారి మూలాల కోసం ఆయన అన్వేషణ కొనసాగింది. శ్రీలంక దేశంలో పాములు, కోతులు ఆడించే రెండు తెగల ప్రజలు తెలుగువారు ఉన్నట్లు గుర్తించి వారి దగ్గరకు వెళ్లి వారి జీవన సంస్కృతులు అధ్యయనం చేశారు. వారి తెలుగు మూలాలు వెలుగులోకి తెచ్చారు. అలాగే బంగ్లాదేశ్‌లోని వందలాది మారుమూల పల్లెల్లో సుమారు 6.5లక్షల మంది తెలుగువారు ఉన్న విషయం వెలుగులోకి తెచ్చారు. ఇక అమెరికా, మలేసియా, మారిషస్ దేశాల్లో కూడా ఆయన పర్యటించి తెలుగు భాషపై లోతైన పరిశోధన చేశారు. 200 ఏళ్ల క్రితం మలేషియాలో స్థిరపడ్డ తెలుగువారు నేటికీ గెంతు, దాటు భజనలు, కోలాటాలు, బుర్రకథలు పదిలంగా కాపాడుకోవడం గుర్తించారు. రచయితగానూ ఆయన రాసిన పుస్తకాలు అచ్చతెలుగు అక్షరాలతో అల్లిన పరిమళ దండలు. భాషాభిమానులను ఎంతగానో పెనవేసుకున్నాయి. ఇందులో ప్రధానంగా పులికాట్ తీర ప్రజల జీవన విధానాన్ని కళ్లకు కట్టిన 'ప్రళయ కావేరి కతలు' పుస్తకం, 'కతల గంప' విశేషంగా తెలుగు పాఠకులను ఆకట్టుకున్నాయి. ఎల'లు లేని తెలుగు' వ్యాసాల పుస్తకం, 'సజీవ సాంప్రదాయంగా వేమన' పరిశోధన పుస్తకం, వ్యాకరణంపై తెలుగు నుడికట్టు పుస్తకం స.వెం.రమేశ్ సాహిత్య, భాషా కృషిని వెల్లడిస్తాయి.

\- శ్రీకాళహస్తి

కాన్సర్ బాధితుడికి నందమూరి ఫ్యాన్స్ డాట్ కాం చేయూత



తిరుపతి(విద్య), సెప్టెంబరు 13:క్యాన్సర్‌తో బాధపడుతూ ఆర్థిక సమస్యల కారణంగా చికిత్స చేయించుకోలేక... రోజురోజుకూ మరణానికి దగ్గరౌతున్న ఓ యువకుడికి నందమూరి ఫ్యాన్స్ డాట్ కాం ఆర్థికసాయం అందించింది. జూనియర్ ఎన్టీఆర్ వీరాభిమాని, తిరుపతికి చెందిన పందొమ్మిదేళ్ల యువకుడు కౌశిక్ కాన్సర్ వ్యాధితో బాధపడుతూ ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న విషయాన్ని 'దేవర సినిమాచూసి చచ్చిపోతా... అమ్మా అప్పటిదాకా బతికించండి' శీర్షికన ఆంధ్రజ్యోతి శుక్రవారం ఓ కథనాన్ని ప్రచురించింది.స్పందించిన నందమూరి ఫ్యాన్స్ డాట్ కాం వెబ్‌సైట్ ప్రతినిధులు బాధితుడి ఇంటికి చేరుకుని 40వేల రూపాయల నగదును కౌశిక్ తల్లిదండ్రులకు అందజేశారు. నందమూరి హీరోల అభిమానులు కొంతమంది నందమూరి ఫ్యాన్స్ డాట్ కాం పేరున ఓ వెబ్‌సైట్‌ను కొన్నేళ్లుగా నిర్వహిస్తున్నారు. ఇబ్బందులు ఎదుర్కొంటున్నవారిని గుర్తించి వీరు ఆపన్న హస్తం అందిస్తున్నారు.ఈ క్రమంలో అనేకమంది విద్యార్థులకు ఫీజులు చెల్లించడం, పుస్తకాలు కొనివ్వడం, పేదవారికి ఆర్థికసాయం అందించడం లాంటి సేవలు అందిస్తున్నారు.

నేడు జూనియర్ ఎన్టీఆర్ పరామర్శ

కౌశిక్ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్న హీరో జూనియర్ ఎన్టీఆర్ శనివారం అతడిని పరామర్శించనున్నారు.తిరుపతికి చెందిన తన అభిమాని కృష్ణయాదవ్‌కు ఫోన్ చేసి కౌశిక్ దగ్గరకు వెళ్లి తనతో ఫోన్లో మాట్లాడించమని చెప్పినట్లు సమాచారం.

16న మిలాద్ ఉన్ నబీ

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 13: మిలాద్ ఉన్ నబీ పండుగను ఈనెల 16వ తేదీన ముస్లింలు జరుపుకోనున్నారు. ఈ సందర్భంగా ర్యాలీలు నిర్వహిస్తారు. అలాగే సోమ, మంగళవారాల్లో ప్రవక్త కేశాలను భక్తుల సందర్శనార్థం ఉంచనున్నారు. చిత్తూరు నగరంలోని మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు.

నేటినుంచి పాఠశాలలకు మూడ్రోజుల సెలవులు

చిత్తూరు (సెంట్రల్), సెప్టెంబరు 13: జిల్లా వ్యాప్తంగా శనివారం నుంచి వరుసగా మూడ్రోజులపాటు పాఠశాలలకు సెలవులు వచ్చాయి. రెండో శనివారం, ఆదివారం సెలవు దినాలు కాగా, సోమవారం మిలాద్ ఉన్ నబీ సందర్భంగా అధికారిక సెలవు. దీంతో వరుస సెలవులు వచ్చినట్లయ్యింది.

నేడు జాతీయ లోక్ అదాలత్

చిత్తూరు లీగల్, సెప్టెంబరు 13: ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఉన్న కోర్టుల్లో శనివారం జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమం ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరుగుతుందన్నారు. క్రిమినల్, సివిల్, బ్యాంకులు, ఇన్సూరెన్స్‌తోపాటు పలురకాల కేసులను రాజీ చేసుకునే అవకాశం ఉందన్నారు. కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

తిరుపతి జిల్లాలోని 120 మంది సెబ్ ఉద్యోగులు నేటి నుంచి ఎక్సైజ్ శాఖ పరిధిలోకి

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 13: స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంటు బ్యూరో (సెబ్)ను రద్దు చేస్తూ డీజీపీ ద్వారకాతిరుమలరావు ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లాలోని 12 సెబ్ స్టేషన్లు శనివారం నుంచి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ సర్కిల్ కార్యాలయాలుగా మారనున్నాయి. అక్కడ పనిచేస్తున్న 12 మంది సీఐలు, మరో 12 మంది ఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్ళు, సిబ్బంది మొత్తం 120 మంది మాతృశాఖకు బదిలీ అయ్యారు. ఇక, సెబ్ స్టేషన్లు అద్దె భవనాల్లోనే వున్నాయి. వాటికి ఆరేడు నెలల అద్దె బకాయిలున్నాయి. భవన యజమానులు మళ్లీ అదే భవనాల్లో ఎక్సైజ్ స్టేషన్ల ఏర్పాటుకు అంగీకరిస్తారా లేదా అన్న చర్చ జరుగుతోంది. ఇక, పోలీసు శాఖ నుంచి డెప్యుటేషన్‌పై సెబ్‌లో పనిచేస్తున్న అదనపు ఎస్పీ రాజేంద్ర మాతృశాఖకు బదిలీ అయ్యారు. ఆయనకు ఇప్పటి వరకు ఎక్కడా పోస్టింగ్ ఇవ్వలేదు. ఇక, తడ వద్ద కొత్తగా ఎక్సైజ్ చెక్ పోస్టు ఏర్పాటు కానుంది. మొబైల్ పెట్రోలింగ్ పార్టీలు, ఎక్సైజ్ సూపరింటెండెంట్, టాస్క్‌ఫోర్సు ఎన్‌ఫోర్సు మెంటు ఏసీ, మొబైల్ పార్టీలు ఏర్పాటు చేయనున్నారు.





మొగిలి ఘాట్లో జరిగిన ప్రమాదంలో గాయపడి పలమనేరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారు

మొగిలి ప్రమాదంపై సీఎం దిగ్భ్రాంతి

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 13: మొగిలి ఘాట్ వద్ద శుక్రవారం మధ్యాహ్నం జరిగిన ప్రమాదంపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటనపై ఆరా తీసిన ఆయన సహాయక చర్యలు, బాధితులకు అందుతున్న వైద్యసాయంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు సరైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు సీఎం చంద్రబాబుతో పాటు రవాణాశాఖ మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. క్షతగాత్రులను ఎమ్మెల్యేలు అమరనాథరెడ్డి, మురళీమోహన్ పరామర్శించారు.

క్షతగాత్రులకు అధికారుల పరామర్శ



ఆస్పత్రిలో క్షతగాత్రులను పరిశీలిస్తున్న ఆర్టీసీ ఈడీ చెంగల్‌రెడ్డి

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 13: మొగిలి ఘాట్ ప్రమాదంలో గాయపడి చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ, జేసీ విద్యాధరి పరామర్శించారు.మెరుగైన వైద్య సేవలందించాలని వైద్యులను ఆదేశించారు.గంటకు పైగా కలెక్టర్ ఆస్పత్రిలోనే వుండి చికిత్స పొందుతున్న వారి దగ్గరకు వెళ్లి ధైర్యం చెప్పారు. ఆర్టీసీ ఈడీ చెంగల్‌రెడ్డి చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. ఆయనతో పాటు చిత్తూరు ఇన్‌చార్జ్ డీపీటీవో రాము తదితరులున్నారు.

సాంకేతిక లోపాలతోనే మొగిలిఘాట్‌లో ప్రమాదాలు

పలమనేరు, సెప్టెంబరు13 : పలమనేరు సమీపంలోని మొగిలి ఘాట్‌రోడ్డుపై పలుచోట్ల సాంకేతిక లోపాలను గుర్తించామని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. మొగిలి ప్రమాదంలో గాయపడి పలమనేరు ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న వారిని ఎస్పీ మణికంఠతో కలిసి పరామర్శించారు.అనంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ మొగిలి ఘాట్ ప్రమాదాలకు నిలయంగా ఉందన్నారు.అక్కడ కొన్ని సాంకేతిక లోపాలున్నాయని, వీటిని జాతీయరహదారి అధికారులతో సంప్రదించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

సోదరి ఇంటికి వెళ్తూ గాయాలపాలు

శ్రీరంగరాజపురం, సెప్టెంబరు 13: బంగారుపాళ్యం మండలం మొగిలి ఘాట్ ప్రమాదంలో ఎస్ఆర్‌పురం మండలం పద్మాపురం గ్రామానికి చెందిన బుల్లెట్ బాబు (53) గాయపడ్డాడు. ఇతను బెంగళూరులోని తన అక్కఇంటికి వెళ్తుండగా, మార్గమధ్యంలో మొగిలి ఘాట్ వద్ద ఆర్టీసీ బస్సును లారీ ఢీకొన్న ప్రమాదంలో ఆయన తలకు, కంటి దగ్గర గాయాలయ్యాయి. బాధితుడు చిత్తూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



గాయపడిన బుల్లెట్ బాబు

వైసీపీ ప్రభుత్వ తీరుతో పంచాయతీలు నిర్వీర్యం

కూటమి అధికారంలోకి వచ్చాక పటిష్ఠానికి చర్యలు ● పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు బాబు రాజేంద్ర ప్రసాద్

తిరుపతి(విద్య), సెప్టెంబరు 13: 'గత వైసీపీ ప్రభుత్వం సర్పంచులకు కనీస సమాచారం ఇవ్వకుండా నిధులు దారి మళ్లించింది. ఉపాధి హామీ నిధులు రూ.36 కోట్లను దుర్వినియోగం చేసింది. దీనివల్ల గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతులు, సదుపాయాల కల్పన ఆగింది. పంచాయతీలు నిర్వీర్యమై.. సర్పంచులు ఉత్సవ విగ్రహాలుగా మిగిలారు' అని పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు బాబు రాజేంద్రప్రసాద్ ఆవేదన వ్యక్తంచేశారు. అందుకనే జగన్‌ను ఓడించామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోనే పంచాయతీలను బలోపేతం చేసేందుకు రూ.12.48 కోట్లను జమ చేసిందని గుర్తుచేశారు. ఉపాధిహామీ పనులకు రూ.9వేల కోట్లను జమ చేసి.. ఊరూరా గ్రామ సభలు నిర్వహించి అభివృద్ధి కార్యక్రమాలు ఏమేమి చేపట్టాలో మీరే నిర్ణయించుకోండంటూ పంచాయతీలకు నిర్ణయాధికారాన్ని ఇవ్వడం అభినందనీయమన్నారు. గత ఐదేళ్లలో భ్రష్టుపట్టిన గ్రామీణ వ్యవస్థను, స్థానిక సంస్థలను కూటమి ప్రభుత్వం బాగుచేసి జవసత్వాలు కల్పించాలని ఆయన కోరారు. ఆ సంఘం ప్రధాన కార్యదర్శి ప్రతాప్‌కుమార్, సింగంశెట్టి సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న బాబు రాజేంద్రప్రసాద్

పాకాల రైల్వేస్టేషన్‌కు మహర్దశ

ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 13: పాకాల రైల్వేస్టేషన్‌కు మహర్దశ పట్టనుందని ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.పాకాల స్టేషన్‌ను అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో కొత్త రైల్వే కోచ్ డిపో ఏర్పాటు చేయాలని, ఆధునికీకరించాలని ప్రతిపాదనలను కేంద్ర రైల్వేశాఖ మంత్రికి తాను సమర్పించానన్నారు. తన విజ్ఞప్తి మేరకు కేంద్ర రైల్వేశాఖ.. పాకాల రైల్వేస్టేషన్ పరిసరప్రాంతాల్లో ఎనిమిదిలైన్ల రైల్వేమార్గంతోపాటు కొత్త రైల్వే కోచ్ డిపోను నిర్మించేందుకు ఈ నెల 9న నిర్వహించిన సేఫ్టీ మీటింగ్‌లో సూత్రపాయంగా ఆమోదం తెలిపిందన్నారు. వచ్చే ఏడాది మార్చి నుంచి పనులు ప్రారంభమయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు.





శ్రీకాళహస్తి, భరద్వాజ మహర్షి ఉత్సవర్ల ఊరేగింపు

ముక్కంటి ఆలయంలో ఆగమోక్తంగా పవిత్రోత్సవాలు

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 13: దక్షిణ కైలాసంగా పేరుగాంచిన ముక్కంటి ఆలయంలో శుక్రవారం పవిత్రోత్సవాలు శాస్త్రోక్తంగా ప్రారంభమయ్యాయి. నిత్య పూజల్లో జరిగే దోషాలను నివారించి మూల విరాట్లకు పునరుత్తేజానికి ఈ పూజలను నిర్వహిస్తు న్నారు. ఐదురోజుల పాటు జరగనున్న ఉత్సవాల్లో తొలిరోజు దక్షిణామూర్తి వద్ద శ్రీ-కాళ-హస్తి, భరద్వాజ మహర్షి ఉత్సవర్లకు ప్రత్యేక పూజలు, పూర్ణాహుతి జరిగాయి. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, సతీమణి రిషితారెడ్డి, ఈవో ఎస్‌వీఎస్ఎన్ మూర్తి, ప్రధాన అర్చకులు స్వామినాథన్ గురుకుల్, టీడీపీ నాయకుడు చెంచయ్యానాయుడు పాల్గొన్నారు.

ఘనంగా నల్లారి సోదరుల జన్మదిన వేడుకలు


పీలేరులో కేక్ కట్ చేస్తున్న టీడీపీ శ్రేణులు


హైదరాబాదులో ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న పీలేరు టీడీపీ శ్రేణులు


:గుర్రంకొండలో అన్నదానం చేస్తున్న టీడీపీ నాయకులు

పీలేరు, సెప్టెంబరు 13: మాజీ ముఖ్యమంత్రి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి పీలేరు శాసనసభ్యుడు, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్ కుమార్‌రెడ్డిల జన్మదిన వేడుకలను శుక్రవారం టీడీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. పీలేరు పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి, కడప రోడ్డు, తిరుపతి రోడ్డు, జెండామను, కట్టుకాలువ వీధి ప్రాంతాలతోపాటు మండలంలోని అన్ని గ్రామాల్లో టీడీపీ శ్రేణులు భారీ కేక్‌లు కట్ చేసి పేదలకు పంచి పెట్టారు. పీలేరు మండల పార్టీ అధ్యక్షుడు వారణాశి శ్రీకాంత్ రెడ్డి, రాజంపేట పార్లమెంటు అధికార ప్రతినిధి కోటపల్లె బాబు రెడ్డి, అమరనాథరెడ్డి, పురం రామ్మూర్తి, శ్రీహరి రెడ్డి, రాజంపేట పార్లమెంటు తెలుగు యువత అధికార ప్రతినిధి స్పోర్ట్స్ మల్లి ఆధ్వర్యంలో స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో పార్టీ శ్రేణుల సమక్షంలో భారీ కేక్ కట్ చేయడమే కాకుండా మార్కెట్ కమిటీ ఆవరణలో పేదలకు అన్నదానం చేశారు. కొంత మంది నాయకులు ఎమ్మెల్యేకు ప్రత్యక్షంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపేందుకు హైదరాబాదుకు తరలి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా పీలేరు మండల వ్యాప్తంగా పండుగ వాతావరణం నెలకొంది. జన్మదిన సంబరాలు గురువారం రాత్రి ప్రారంభమై శుక్రవారం అర్ధరాత్రి వరకు కొనసాగాయి. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో లడ్డూ జాఫర్, లక్ష్మీకర, ఆతిఖా షఫీ, ఎస్ఎంసీ ఛైర్మన్ ఆంజినేయులు, నాయకులు ఖాదర్ బాషా, సూరి, జాండ్ల బాబ్జీ రెడ్డి, ప్రభాకర రాజు, ఎర్రగుంట్లపల్లె అమరనాథరెడ్డి, అనిల్ కుమార్ రెడ్డి, షౌకత్ అలీ, చంద్రారెడ్డి, చాన్ బాషా, ఫైరోజ్, సలీం, సాధన, పురం రెడ్డమ్మ, రెడ్డిరాణి, రమాదేవి, లక్ష్మీకాంతమ్మ, సుబ్బయ్య, ఖాజాపీర్, నాగేంద్ర, బాలకృష్ణ, రహంతుల్లా, పఠాన్ మౌలా, యల్లెల రెడ్డప్పరెడ్డి, అన్నారెడ్డి, గాండ్ల విజయ్ కుమార్, హనీఫ్, షరీఫ్, శేఖర, సుభద్రమ్మ పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో: మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డిల జన్మదిన వేడుకలను శుక్రవారం వాల్మీకిపురంలో ఘనంగా జరుపుకున్నారు. నాయకులు, కార్యకర్తలు కలిసి భారీ కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి జన్మదినం కూడా కావడంతో ఆయన అనుచరులు, నాయకులు, కార్యకర్తలు స్థానిక బైపాస్ రోడ్డులోని చౌడేశ్వరిదేవి ఆశ్రమంలో వృద్ధులకు పండ్లు, రొట్టెలు పంపిణీతో పాటు అన్నదానం చేశారు. కార్యక్రమాలలో జిల్లా పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటరమణ, మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు నరేంద్రరెడ్డి, నాయకులు గాంధీపేట రమణ, పులి సత్యారెడ్డి, రాజేంద్రాచారి, పీలేరు పార్టీ మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్‌బాషా, పీవీ నారాయణ, వల్లిగట్ల రమణ,రామాంజులురెడ్డి, ఎండీ యూసుఫ్, జంషీద్, రమేష్, ఆదినారాయణ, షబ్బీరుల్లా, టీస్టాల్ సైదు, అబ్బాస్, నాగరాజు, జనసేన ప్రభాకర్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు. మండలంలోని చింతపర్తి గ్రామంలో నల్లారి సోదరుల్ల జన్మదిన వేడుకలను టీడీపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేసికార్యకర్తలకు పంపిణీతోపాటు పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమాలలో సర్పంచ్ మహిత, నాయకులు శేషాద్రిరెడ్డి, కాంతరాజు, ద్వారకనాథరెడ్డి, భాస్కర్‌రెడ్డి, గెంద్రెడ్డి చంద్రారెడ్డి, కేవీరెడ్డి, హరినాథరెడ్డి, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

గుర్రంకొండలో:పీలేరు ఎమ్మెల్యే, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలను టీడీపీ నాయకులు, నల్లారి అనుచరులు శుక్రవారం మండలంలో ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా బస్టాండులో కేక్‌ను కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అన్ని గ్రామాల్లో నాయకులు కేక్ కట్ చేశారు. అలాగే మండల పార్టీ అధ్యక్షుడు జగదీష్ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నాయకులు జగదీష్‌కుమార్, ప్రసాద్‌నాయుడు, నౌషాద్ అహ్మద్, ఎల్లుట్ల మురళీ, చలమారెడ్డి, చంద్రబాబు, ఏజాజ్ అహ్మద్, ఇక్బాల్‌ఖాసీం, జయసూరి, నాగేంద్రరెడ్డి, ప్రదీప్‌చంద్, ఫర్వేజ్, ఎండీ జమీర్, ఎస్ఎల్‌టీ.బాబాజాన్, మహ్మద్, విజయ్, తాజ్, రామయ్య, ప్రసాద్, అల్తాఫ్, షఫీ తదితరులు పాల్గొన్నారు.

కలకడలో:టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కలకడ టీడీపీ కార్యాలయం ఎదురుగా 59 కిలోల భారీ కేక్‌ను కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో నాయకులు వంగిమళ్ల మధుసూదన్‌రెడ్డి, మల్లారపు రవిప్రకాశ్‌నాయుడు, ప్రభాకర్‌నాయుడు, బరకం శ్రీనివాసులరెడ్డి, బీవీస్వామి, కాంతారావు, బీవీనాయుడు, లక్ష్మీప్రసన్న, వసంతనాయుడు, రైస్‌మిల్ రమణ, తారకేశ్వర, సతీష్, ఆనంద్‌రెడ్డి, శేఖర్‌నాయుడు, వెంకటేశ్వరరావు, చంద్రమోహన్, త్యాగరాజు, నౌషాద్, యల్లయ్య, రామాంజులు, జిలానీ, ఇనాయతుల్లా, ఇర్ఫాన్‌లు పాల్గొన్నారు.

కలికిరిలో: పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి జన్మదిన వేడుకలను శుక్రవారం మండలంలో పలు చోట్ల టీడీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. స్థానిక అమరనాథ రెడ్డి భవన్‌లో కేక్ కట్ చేసి పంచిపెట్టారు. చక్కెరవాండ్లపల్లెలో రాత్రి టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే జన్మదిన వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మండల టీడీపీ అధ్యక్షుడు నిజాముద్దీన్, ఉపాధ్యక్షుడు ఆర్‌సీ రెడ్డెప్ప రెడ్డి, రెడ్డివారి యోగేష్ రెడ్డి, జనసేన ఇన్‌చార్జి అస్లామ్, చంద్రశేఖర్, వెంకటనారాయణరెడ్డి, సతీష్ రెడ్డి, ఎంపీటీసీ కృష్ణయ్య, మున్వర్, సురేష్‌కుమార్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, నాగభూషణ రెడ్డి, వెంకటేశ్వర రెడ్డి, శ్రీనివాస వర్మ, సనావుల్లా, మునాఫ్, ముస్తఫా, రమేష్, వెంకటపతి, వైజాగ్ బాషా, మోహన, సుబ్బయ్య, అఫ్రోజ్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

కురబలకోట, సెప్టెంబరు 13: గుర్తుతెలియని వాహనం ఢీకొన్న ప్రమాదంలో శివమణి(22) అనే ద్విచక్రవాహనదారుడు మృతి చెందాడు. మదనపల్లె మండలం సీటీఎం పంచాయతీ చిలకవారిపల్లెకు చెందిన శివమణి గురువారం రాత్రి అంగళ్ళులో తన ద్విచక్రవాహనంలో బయలుదేరి ఇంటికి వెళుతుండగా మార్గమధ్యంలో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో బోల్తాపడి అక్కడికక్కడే మృతి చెందాడు. కాగా ముదివేడు పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని విచారించి పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మరో ప్రమాదంలో వ్యక్తి మృతి

పీలేరు, సెప్టెంబరు 13: పీలేరు మండలం తలపుల పంచాయతీ బోయపల్లె గ్రామంరాజువారిపల్లె చెరువు వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మార్కండేయులు(54) అనే వ్యక్తి మృతి చెందాడు. తిరుపతి జిల్లా ఎర్రావారిపాళెం మండలం ఓఎస్ గొల్లపల్లెకు చెందిన మార్కండేయులు తన వ్యక్తిగత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంలో తలపులకు వచ్చి పనులు ముగించుకుని స్వగ్రామానికి వెళుతుండగా పీలేరువైపు వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో అతను అక్కడిక్కడే మృతి చెందాడు. పీలేరు పోలీసులు కేసు నమోదు చేసి అతని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు.

కురబలకోటలో రైతు అదృశ్యం


అదృశ్యమైన రైతు చలపతి

కురబలకోట, సెప్టెంబరు 13: రైతు అదృశ్యమైన సంఘటన మండలంలో జరిగింది. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. మండలంలోని చింతమాకులపల్లె పంచాయతీ పులగూరవాండ్లపల్లెకు చెందిన చలపతి (60)అనే రైతు పొలంలో ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసుకోవడానికి ప్రయత్నం చేస్తుండగా ప్రత్యర్థులు అడ్డుతగలారు. దీంతో మనస్తాపం చెంది ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఈ మేరకు కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలిపై దాడి..ఆస్పత్రికి తరలింపు

నిమ్మనపల్లి, సెప్టెంబరు 13: ఒంటరిగా ఉన్న సుభద్రమ్మ(65) అనే వృద్ధురాలిపై శుక్రవారం దాడి జరిగింది. కుటుంబీకుల వివరాల మేరకు అగ్రహారం పంచాయతి బండమీద దళితవాడకు చెందిన సుభద్రమ్మఇంటి వద్ద ఒంటరిగా ఉండగా అదే గ్రామానికి చెందిన సుధాకర్, నవీన్‌లు ఇంట్లోకి ప్రవేశించారు. దీంతో ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఎందుకు వచ్చారని ఆమె వారిని ప్రశ్నించగా విచక్షణారహితంగా దాడి చేసి గాయపరచారు. అక్కడే ఉన్న బంధువులు గమనించి గాయపడిన సుభద్రమ్మను 108 సాయంతో మదనపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. దీనిపై పోలీసులను విచారించగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

చికిత్స పొందుతూ బాలుడు మృతి


ధనరాజ్ (ఫైల్‌ఫొటో)

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 13: ఆత్మహత్యకు యత్నించిన బాలుడు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తంబళ్లపల్లె ఎస్ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు. తంబళ్ళపల్లె మండలం, కోసువా రిపల్లె గ్రామం, దిగువ ముత్రావారిపల్లెకు చెందిన చలపతి, రెడ్డెమ్మల కుమారుడు ధనరాజ్ (16) మూడు రోజుల క్రితం ఇం ట్లో మందలించారని మనస్తాపానికి గురై పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి చికిత్స కోసం తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యంకోసం బెంగళూరులోని ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం రాత్రి చనిపోయాడు. మృతదేహాన్ని శవపంచనామా కోసం తిరిగి మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తంబళ్ళపల్లె ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చిప్పిలి ట్యాంకు పనులు పూర్తి చేయండి

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 13: మదనపల్లె దాహార్తి తీర్చే చిప్పిలి సమ్మర్‌స్టోరేజీ ట్యాంకు మొరవ పనులను రెండు నెలల్లో పూర్తి చేయాలని హెచ్ఎన్ఎస్ఎస్ సూపరింటెండెంట్ ఇంజనీర్ సీఆర్ రాజగోపాల్ కాంట్రాక్టర్లను ఆదేశించారు. శుక్రవారం స్థానిక హెచ్ఎన్ఎస్ఎస్ కార్యాలయంలో నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ ప్రతినిధులు, హెచ్ఎన్ఎస్ఎస్ ఇంజనీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ వచ్చే ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో శ్రీశైలం నుంచి బ్యాక్‌వాటర్‌ను హంద్రీ-నీవాకు మళ్లించే అవకాశం ఉందన్నారు. అంత లోపు పీటీఎం మండలం నుంచి రామకుప్పం వరకు ఉన్న పుంగనూరు బ్రాంచి కెనాల్ పొడవునా గండి పడిన చోట్ల కాలువ కట్టలను పటిష్టం చేయడంతో పాటు, కాంక్రీట్ లైనింగ్ పనులను పూర్తి చేయాలన్నారు. దీని కోసం 15 రోజుల్లో వెడల్పు పనులు ప్రారంభించాలని ఆదేశించారు. ముఖ్యంగా కురబలకోట మండలం రిషివ్యాలీ, బి.కొత్తకోట మండలాల్లోని కొన్ని ప్రాంతాల్లో కాంక్రీట్ లైనింగ్ పనులు ప్రారంభించాలన్నారు. ఈ సమావేశంలో ఎన్‌సీసీ ఏజెన్సీ ప్రతినిధి బి.జయప్రసాద్‌రెడ్డి, హెచ్ఎన్ఎస్ఎస్ ఈఈలు సురేష్‌బాబు, బి.వెంకటేశ్వరరావు, డీఈలు లింగారెడ్డి, శ్రీదేవి, త్రివేణి, చోక్లానాయక్, రవి, వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

దళితుడిపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 13: దళితుడు నారాయణపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం మదనపల్లె జిల్లా ఆస్పత్రి ఎదుట బీఎస్పీ నాయకులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ మదనపల్లెలో 20 రోజుల వ్యవధిలోనే నాలుగు చోట్ల దళితులపై వరుస దాడులు చేశారన్నారు. మండలంలోని చీకలబైలు గ్రామంలో గత మూడు రోజులక్రితం నారాయణపై దాడిచేసి తలను పగలకొట్టినా ఇప్పటివరకు నిందుతులను అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. దాడిలో గాయపడిన నారాయణను జిల్లా ఆస్పత్రిలో కలిసి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు పాల్గొన్నారు.కాగా సెల్‌ఫోన్ పోయిందని చీకలబైలు కు చెందిన నారాయణ, అతని భార్యపై కత్తితో దాడి చేసి నరికిన వసంత్‌పై శుక్రవారం ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసినట్లు తాలుకా సీఐ కళా వెంకట రమణ తెలిపారు.

కండక్టర్ కుటుంబానికి ఆర్థిక సాయం

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు13: మదనపల్లె వన్ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తూ కరోనా సమయంలో మృతి చెందిన ఎన్ నరసింహులు కుటుంబానికి శుక్రవారం ఆర్థిక సహాయం అందజేశారు. స్థానిక వన్ డిపో కార్యాలయంలో ఆయన కుటుంబసభ్యులకు రూ.7లక్షల వంద రూపాలయు ఈడీఎల్ఐఎఫ్ చెక్కులను వన్ డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా మేనేజరు మాట్లాడుతూ నరసింహులు కండక్టర్‌గా ఆర్టీసీ డిపోకు ఆదాయం చేకూర్చడానికి తనవంతు కృషి చేశారని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాద ఘటనపై కేసు నమోదు

కలకడ, సెప్టెంబరు 13:సత్యవతి నదికి సమీపంలో ఈ నెల 11న జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటనపై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. సంబేపల్లె మండలం అగ్రహారంకు చెందిన రిటైర్డ్ హెచ్ఎం ఎంపీనాగన్న ద్విచక్రవాహనంలో కలకడ సంతకు వస్తుండగా ఎర్రయ్యగారిపల్లె పంచాయతీ ఎస్టీ కాలనీకి చెందిన మల్లికార్జున్ నాయక్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నాగన్నను తిరుపతికి తరలించి ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అమ్మవారి మెడలో నగ దొంగలించిన ఇద్దరు అరెస్టు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 13: రామాలయంలో అమ్మవారి మెడలో బంగారు నగ దొంగళించిన ఇద్దరి యువకులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. పోలీసుల కథనం మేరకు మొలకదిన్నెకు చెందిన హరీష్ అలయాస్ హరి (29), సాయిప్రతాప్ అలియాస్ ప్రతాప్(25) ఈ నెల 10వ తేదీన మొలకదిన్నెలోని రామాలయంలో అమ్మవారి మెడలోని బంగారు నగ 2.1 గ్రాములు దొంగళించారు. వారిద్దరూ తాగుడుకు అలవాటు పడి ఆలయంలో దొంగతనాలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఆలయ పూజారి శశికాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి వారిని రిమాండ్ తరలించినట్లు సీఐ చెప్పారు.

ఆంగ్లం మీద పట్టు సాధించాలి

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 13: విద్యార్థులు ఆంగ్లభాషపై పట్టుసాధిస్తే ఏ ఉద్యోగాల్లో అయినా రాణిస్తూ ప్రపంచాన్ని చుట్టేయ వచ్చని విల్ 2 కెన్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ రామేశ్వరం పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక జ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో ఐదు రోజుల పాటు నిర్వహించనున్న ఇంగ్లీష్ ఓరియెంటెంట్ సదస్సును కరస్పాండెంట్ ఆర్.గురుప్రసాద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా రామేశ్వరం మాట్లాడుతూ తాను రూపొందించిన మెథడాలజితో ఆంగ్లంపై ప్రతి విద్యార్థి పట్టుసాధించవచ్చన్నారు. అదే విధంగా క్యాంపస్ ఇంటర్వ్యూలను ఎదుర్కొనవచ్చన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా వెంకన్న పవిత్రోత్సవాలు


స్వామి వారికి స్నపన తిరమంజనం నిర్వహిస్తున్న టీటీడీ వేదపండితులు

తంబళ్లపల్లె, సెప్టెంబరు 13: తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లెలో కొలువైన ప్రసన్న వేంకటరమణ స్వామి ఆలయంలో పవిత్రోత్సవాలను టీటీడీ ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ఏడాది పొడవునా ఆలయంలో జరిగే అర్చనలు, ఉత్సవాల్లో తెలిసి, తెలియక కొన్ని దోషాలు జరుగుతుంటాయని వాటి వల్ల ఆలయ ప్రతిష్టకు ఎలాంటి లోపం రానీయకుండా ఆగమ శాస్త్రం ప్రకారం పవిత్రోత్సవాలు నిర్వహిస్తారు. ఇందులో బాగంగా టీటీడీ ఆగమ సలహాదారు ఉభయ వేదాంత కాండూరి శ్రీనివాసచార్యులు, ఉప ప్రధాన అర్చకులు కృష్ణప్రసాద్ భట్టర్, ఆలయ అర్చకులు రమేష్‌లు శుక్రవారం తెల్లవారుజామున స్వామి వారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి ఆగమ శాస్త్రం ప్రకారం యాగశాల చతుష్టానార్చనం, పవిత్రప్రతిష్ట, పూర్ణాహుతి అనంతరం స్నపన తిరుమంజనం నిర్వహించారు. భక్తులు పవిత్రోత్సవాల్లో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో వరలక్ష్మీ, ఆలయ అధికారి దుశ్యంత్‌కుమార్, సిబ్బంది నగేష్, రవి, గ్రామప్రజలు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా వినాయక నిమజ్జన వేడుకలు

కురబలకోట, సెప్టెంబరు 13: కురబలకోట మండలం ఎర్రజేనువారిపల్లెలో వినాయక నిమజ్జన వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. శుక్రవారం మండలంలోని ఎర్రజేనువారిపల్లెలో గ్రామానికి చెందిన యూత్ ఆధ్వర్యంలో వినాయకుడిని గ్రామ పురవీధుల్లో ప్రత్యేకంగా ఊరేగించి చెరువులో నిమజ్జనం చేశారు. అనంతరం లడ్డుకు వేలంపాటలు నిర్వహించగా గ్రామానికి చెందిన మహేష్‌కుమార్‌రెడ్డి రూ.1.16లక్షలు పాడి దక్కించుకున్నాడు. కార్యక్రమంలో బాలకృష్ణారెడ్డి, శరత్‌కుమార్‌రెడ్డి, వినోద్‌కుమార్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, విజయ్‌కుమార్, పవన్‌కుమార్‌రెడ్డి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

అబ్బుర పరిచిన యోగాసనాలు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 13: వలసపల్లె నవోదయ విద్యాలయంలో నిర్వహిస్తున్న జాతీయ యోగా మీట్‌లో భాగంగా శుక్రవారం రెండో రోజు యోగాసనాలను విద్యార్థులు అవలీలగా చేశారని జవహర్ నవోదయ మదనపల్లె ప్రిన్సిపాల్ గోవిందరావు, ఆర్గనైజర్ బెంగళూరు రూరల్ ప్రిన్సిపాల్ చక్రవర్తి తెలిపారు. అండర్ 14, అండర్ 17 స్థాయి అండర్ 19 స్థాయిల్లో బాల బాలికలకు వేరువేరుగా పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో నవోదయ విద్యాలయ సమితి రీజినల్ ఆఫీసు హైదరాబాదు అసిస్టెంట్ కమిషనర్ రామకృష్ణన్. నవోదయ సత్యసాయి జిల్లా ప్రిన్సిపాల్ నాగరాజ పర్యవేక్షించారు.

చిరుధాన్యాలతోనే ఆరోగ్యం


అంగన్‌వాడీ కేంద్రంలో చిరుధాన్యాలు ప్రదర్శన

పెద్దమండ్యం, సెప్టెంబరు 13: చిరుధాన్యాల ఆహారం తీసుకోవడం వల్ల అందరు ఆరోగ్యవంతులుగా ఉంటారని ఎంపీడీవో శ్రీధర్‌రావు, అంగన్‌వాడీ సూపర్‌వేజర్ నాగలక్ష్మీ పేర్కొన్నారు. మండలంలోని కోటకాడపల్లి, గుర్రంవాండ్లపల్లి, బండమీదపల్లి, సిద్దవరం, ఎన్‌వోల్లి గ్రామాలలోని అంగన్‌వాడీ కేంద్రాలలో మాసోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా తాటిమాకులపల్లి అంగన్‌వాడీ సూపర్‌వేజర్ నాగలక్ష్మీ మాట్లాడుతూ సద్దలు, రాగులు, సామలు, జొన్నలు పలు చిరుధాన్యాల ఆహారం తోనే మన పెద్దలు ఆరోగ్యవంతులుగా జీవితం గడిపినందుకు మనం వారికి ఆదర్శంగా తీసుకోవాలన్నారు.

పెద్దతిప్పసముద్రంలో : బి.కొత్తకోట ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని పెద్దతిప్పసముద్రం మండలం నవాబుకోట పంచాయతీలోని పెద్దపొంగుపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ నాగరత్నమ్మ మాట్లాడుతూ గర్భవతులు ప్రారంభ దశ నుండే సరైన పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, మొలకెత్తిన గింజలు, చిరుధాన్యాలతో స్టాల్‌ను ఏర్పాటు చేసి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు శంకరమ్మ, శాంతమ్మ, నిర్మల, జయసుధ, హెల్పర్లు పాల్గొన్నారు.

స్వచ్ఛతా హి సేవను పకడ్బందీగా నిర్వహించాలి

ములకలచెరువు, సెప్టెంబరు 13: స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీవో పోలప్ప ఆదేశించారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో శుక్రవారం స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంపై వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 17 నుంచి వచ్చే నెల 2వతేదీ వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. స్వచ్ఛతా భాగ్ ధారి కింద పబ్లిక్ ఈవెంట్స్, వర్క్‌షాపులు, ర్యాలీలు, విద్యార్థులకు క్విజ్ పోటీలు, గ్రామసభలు, విధిగా చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమాల్లో పంచాయతీ కార్యదర్శులు భాగస్వామ్యం కావాలన్నారు.

వరద బాధితులందరికీ సాయమందిస్తాం


విజయవాడ సెంట్రల్‌లో వరద బాధితులకు సరుకులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 13: విజయవాడలో వరదలతో సర్వం నష్టపోయిన బాధిలందరికీ సీఎం చంద్రబాబునాయుడు సాయమందిస్తున్నారని, ఆయన సూచనలతో తాము కూడా తమవంతు సహాయం అందిస్తున్నామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. శుక్రవారం విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలోని సింగ్‌నగర్, నందమూరినగర్, రాధానగర్, బాంబేకాలని, రాయనపాడు, రాజీవ్‌నగర్, ప్రాంతాల్లో ఎమ్మెల్యే షాజహాన్ బాషా నేరుగా ఇంటింటికి వెళ్లి వరద బాధితులకు సరుకుల కిట్లను పంపిణీ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు వరద బాధితులను పరామర్శిస్తూ వారికి కావాల్సిన అన్ని వస్తువులను సమకూరుస్తున్నారన్నారు. మదనపల్లె ప్రజల నుంచి వచ్చిన ఆర్థిక సహాయంతో 3వేల కిట్ల సరుకులను, 500 గ్యాస్‌స్టౌవ్‌లను బాధితులకు పంపిణీ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు విద్యాసాగర్, నాగార్జున గాంధీ, బాలుస్వామి, గణపతి తదితరులు పాల్గొన్నారు.

మేము సైతమంటూ విరాళాలు సేకరించిన విద్యార్థులు


విరాళాలు సేకరిస్తున్న విద్యార్థులు

ములకలచెరువు, సెప్టెంబరు 13: విజయవాడ వరద బాధితుల కోసం విద్యార్థులు మేము సైతమంటూ విరాళాల సేకరణకు ముందుకొచ్చారు. ములకలచెరువులో శుక్రవారం స్థానిక శ్రీ శారదా విద్యామందిర్, ఆక్స్‌ఫర్డ్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు ర్యాలీగా వచ్చి విరాళాలు సేకరించారు. దుకాణాల వద్ద, వారపు సంతలో రూ.10వేలు విరాళాలు సేకరించారు. ఈ నగదను ముఖ్యమంత్రి సహాయ నిధికి పంపుతామని ఉపాధ్యాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్లు శ్రీవాణి, సనత్‌కుమార్, ప్రిన్సిపల్ సిద్ధారెడ్డి, హెచ్ఎం ప్రసాద్, ఆడ్మినిస్ట్రేటీవ్ శ్రీనివాసులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన మండల స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు


మండల స్థాయి స్కూల్ గేమ్స్ విజేతలతో ఉపాధ్యాయులు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 13: గత మూడు రోజులుగా మదనపల్లె, సీటీఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మదనపల్లె మండల స్కూల్ గేమ్స్ అండర్ 14, 17 బాల బాలికల పోటీలు విజయవంతంగా ముగిశాయి. ఈ సందర్భంగా శుక్రవారం మండల స్కూల్ గేమ్స్ కో- ఆర్డినేటర్ శివశంకర్ మాట్లాడుతూ గెలుపొందిన క్రీడాకారులు నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు అర్హత సాధించారన్నారు. కార్యక్రమంలో హెచ్ఎంలు ఆంజనేయులు, సుబ్బారెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు నాగ రాజ, నరేష్, దేవకమ్మా, సుధాకర్, జలజా, శరత్, అంజనప్పా, మహేంద్ర, మహేష్, జోహా ర్, గౌస్‌లు పాల్గొన్నారు.

నిమ్మనపల్లిలో: మండలంలోని స్థానిక జడ్పీహైస్కూల్‌లో స్కూల్‌గేమ్స్‌ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో క్రీడాపోటీలు శుక్రవారం ముగిశాయని ఎంఈవో-2నారాయణ పేర్కొన్నారు. మండల స్థాయిలో విన్నర్‌లుగా నిలిచిన జట్లు నియోజకవర్గ స్థాయిలో జరిగే క్రీడా పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. అనంతరం పీఈటీ బద్రీ మాట్లాడుతూ అండర్-14, అండర్-17 క్రింద జరిగిన క్రీడలలో బాలురకబడ్డీలో నిమ్మనపల్లి జడ్పీ హైస్కూల్, రన్నర్లుగా రెడ్డివారిపల్లి బాలుర జట్టు నిలువగా, కబడ్డీబాలికలు జట్టు విన్నర్లుగా, రన్నర్లుగా నిమ్మనపల్లి జడ్పీహైస్కూల్, వాలీబాల్ బాలుర జట్టు విన్నర్లుగా నిమ్మనపల్లి జడ్పీహైస్కూల్, రన్నర్లుగా రెడ్డివారిపల్లి జడ్పీహైస్కూల్ ఉన్నాయన్నారు. అలాగే ఖోఖో జట్లు కూడా పాల్గొన్నాయని తెలిపారు. మెదటి స్థానం సాధించిన జట్లు నియోజకవర్గస్థాయిలో 17, 18, 19 తేదీల్లో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో పీఈటీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


కాంట్రాక్టు నర్సుల సమస్యలను తక్షణం పరిష్కరించాలి


ప్రభుత్వాస్పత్రి ఎదుట మోకాళ్లపై కూర్చొని నిరసన తెలుపుతున్న కాంట్రాక్టు నర్సులు

మదనపల్లె టౌన్, సెప్టెంబరు 13: అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్న నర్సుల ఉద్యోగాలకు నష్టం కలిగించే జీవో నెంబర్ 115ను రద్దు చేసి సమస్యలు తక్షణం పరిష్కరించాలని బాధిత నర్సులు డిమాండ్ చేశారు. ఆ మేరకు శుక్రవారం స్థానిక సర్వజన బోధనాస్పత్రి వద్ద మోకాళ్లపై కూర్చొని నర్సులు వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 11 ఏళ్లుగా కాంట్రాక్టు విధానంలో విధులు నిర్వహిస్తున్నా సమస్యలు పరిష్కరించడంలేదన్నారు. ఇప్పుడు జీవో నెంబర్ 115తో స్కిల్డ్ ఉద్యోగుల పేరిట కొత్తవారిని తీసు కొచ్చి తమకు అన్యాయం చేయవద్దని డిమాండ్ చేశారు.

నిమ్మనపల్లిలో: గత ప్రభుత్వం తీసుకొచ్చిన 115 జీవో రద్దుపరచి తమకు న్యాయం చేయాలని స్టాఫ్‌నర్సులు శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఏఎన్ఎంలుగా సచివాలయాల్లో పని చేస్తున్న వారికి జీఎన్ఎంలుగా మారుస్తూ జీవో ఇవ్వడంతో బీఎస్సీ, స్టాఫ్‌నర్సు, జీఎన్ఎంలు కోర్సులు చదివి వచ్చిన నర్సులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని వాపోయారు. దీని ద్వారా అర్హులైన వారు అన్యాయం అయిపోతారని వెంటనే 115 జీవోను రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్‌నర్సులు యమున, రెడ్డెమ్మ, ఇంద్రజ తదితలు పాల్గొన్నారు.

సీపీఎం ప్రధాన కార్యదర్శి ఏచూరి మరణం తీరనిలోటు


సీతారాం ఏచూరి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నేతలు

మదనపల్లె అర్బన్, సెప్టెంబరు 13: సీపీఎం అఖిల భారత ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి మరణం పార్టీకి దేశానికి తీరనిలోటని అన్నమయ్య జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. మదనపల్లె సీపీఎం కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఏచూరి సంతాప సభ స్థానిక మార్కెట్ యార్డు వద్ద నిర్వహించారు. కార్యక్రమంలో ఏచూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ దేశంలో కమ్యూనిస్టు ఉద్యమానికి ఏచూరి కీలకపాత్ర పోషించారని కొనియాడారు. సీపీఎం నాయకులు ప్రభాకర్‌రెడ్డి, హరిశర్మ, నాగరాజు, వెంకటేశ్వర, రెడ్డిప్రసాద్, ఐటీయూసీ నాయకుడు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

పీలేరులో: సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి శుక్రవారం పీలేరులోని సీఐటీయూ శ్రేణులు ఘనంగా నివాళులర్పించాయి. పీలేరు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఆయన చిత్రపటాన్ని ఆవిష్కరించి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా ఏపీ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దానాసి వెంకటరామయ్య మాట్లాడుతూ సీతారం ఏచూరి మృతి దేశానికితీరన లోటని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ సభ్యులు ఆర్టీసీ బాబు, కేఎస్ రెడ్డి, హమాలి నాగరాజ, గుర్రం నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కోరం లేక మండల సమావేశం మళ్లీ వాయిదా

కలికిరి, సెప్టెంబర్టు 13: మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం కోరం లేని కారణంగా తిరిగి వాయిదా పడింది. అధ్యక్ష స్థానంలో ఉన్న వైసీపీకి చెందిన ఎంపీపీ నూర్జహాన్‌తో సహా కేవలం ముగ్గురు సభ్యులు మాత్రమే హాజరు కావడంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో సమావేశాన్ని వాయిదా వేశారు. వైసీపీకే చెందిన మరో 8 మంది సభ్యులు సమావేశానికి హాజరు కాకుండా మొహం చాటేశారు. వారితోపాటు మరో ముగ్గురు టీడీపీ సభ్యులు కూడా సమావేశం వైపు రాలేదు. దీంతో తిరిగీ వాయిదా వేయక తప్పలేదు. గత నెల 24వ తేదీన జరగాల్సిన సమావేశం కోరం లేని కారణంగా వాయిదా పడింది. దీనికి కొనసాగింపుగా ఈ సమావేశాన్ని శుక్రవారం జరిపేందుకు నిర్ణయించారు. సమావేశం ఉదయం 11.30 గంటలకు ప్రారంభం కావలసి ఉన్నా ఎంపీపీ నూర్జహాన్‌తోపాటు మహల్ ఎంపీటీసీ సావిత్రి, కోఆప్షన్ సభ్యుడు మాత్రం హాజరయ్యారు. మిగతా సభ్యులెవరూ రాకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో గంగయ్య ప్రకటించారు. కలికిరి సీఐ రెడ్డిశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పీలేరు ఎస్ఐ బాలకృష్ణ, ఏఎస్ఐలు మహబూబ్ బాషా, మధుసూదనాచారి, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

పక్కా గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

పెద్దమండ్యం, సెప్టెంబరు 13: మండలంలో పక్కాగృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీవో శ్రీధర్‌రావు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాయలంలో పక్కా గృహాల నిర్మాణ పనులపై ఎంపీడీవో మాట్లాడుతూ మండలంలో వివిద దశల్లో ఉన్న పక్కా గృహాల నిర్మాణాలను సకాలం పూర్తి చేయాలన్నారు. ఎన్‌డీఏ ప్రభుత్వంలో సకాలంలో బిల్లులు చెల్లింపులు జరుగుతుందన్నారు. గృహ నిర్మాణాలు జాప్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. దశల వారీగా మండలంలో జీఎస్ ఇంజనీరు అసిస్టెంట్‌లు పక్కా గృహాల నిర్మాణాలపై దృష్టి సారించాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, జీఎస్ ఇంజనీర్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు. .